హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.0 । కనిష్ఠం 19.2

● హవనాలు, జపాలు



యాదగిరీశుడి స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాల సందర్భంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు

●7లో..

'థార్' గ్యాంగ్

సూత్రధారి అరెస్టు

- మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అష్రఫ్‌ఖాన్
- సెటిల్‌మెంట్లే తప్ప కేసులు, అరెస్టులు తక్కువే
- నార్కట్‌పల్లి ట్రావెల్స్ బస్సులో రూ.25లక్షల నగదు తస్కరించింది ఈ ముఠానే
- పరారీలో ముగ్గురు ముఠా సభ్యులు

●6లో..

● లింగన్నా.. మళ్లొస్తాం



సూర్యాపేట జిల్లా పెద్దగట్టు జాతర ముగియడంతో చివరి రోజూ భక్తులు స్వామివారిని దర్శించుకొని ఇంటికి తిరుగుపయనమయ్యారు.

●6లో..

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోరు ఉత్కంఠభరితంగా సాగుతోంది. ప్రధాన అభ్యర్థుల ప్రచారం, వ్యూహరచన పోటాపోటీగా సాగుతోంది. ఈనెల 25 సాయంత్రానికి ప్రచార గడువు ముగియనుండడంతో ఈలోగా వీలైనంత మేర ప్రతీ ఉపాధ్యాయుడికి తమ పోటీ ఉద్దేశం, గెలుపు ఆవశ్యకత సందేశమందేలా అభ్యర్థులు, వారి తరపున సంఘాలు పనిచేస్తున్నాయి. బీజేపీ మాత్రమే అధికారికంగా పార్టీ అభ్యర్థిని నిలబెట్టడమేగాక ఆ పార్టీ కీలకనేతలంతా ప్రచారం నిర్వహిస్తున్నారు. అధికార కాంగ్రెస్ ఇప్పటివరకు మద్దతు ఎవరికనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఈ ఎన్నికలకు దూరంగా ఉంటామని ప్రకటించింది. బీజేపీ మినహా మిగిలిన పార్టీలు ఈ ఎన్నిక విషయంలో తటస్థంగా ఉండగా, ఉపాధ్యాయ సంఘాలు మాత్రం పోటాపోటీగా బలపరచిన అభ్యర్థుల కోసం పనిచేస్తున్నాయి. సమావేశాలు, సమ్మేళనాలు, సోషల్ మీడియా ప్రచారాలు, వాట్సప్‌లలో సందేశాలు, కరపత్రాలు, హామీ ప్రకటనలతో ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగిస్తున్నాయి.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



ఉత్కంఠ భరితంగా ఎమ్మెల్సీ పోరు

- ఉధృతంగా ప్రచారం సాగిస్తోన్న అభ్యర్థులు
- అభ్యర్థుల గెలుపుకోసం సంఘాల కృషి
- తమ పార్టీ అభ్యర్థిని గెలిపించడానికి రంగంలోకి దిగిన బీజేపీ
- వ్యూహప్రతివ్యూహాలు అమలుచేస్తోన్న ప్రధాన అభ్యర్థులు

ఉపాధ్యాయ నియోజకవర్గంలో క్షేత్రస్థాయి ప్రచారం ఉధృతంగా సాగుతోంది. ప్రతీ ఉపాధ్యాయుడికి సందేశం అందేలా అభ్యర్థులు,వారికి మద్దతిస్తున్న సంఘాలు ప్రచారం సాగిస్తున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి స్థానాన్ని నిలబెట్టుకోవడానికి టీఎస్ యూటీఎఫ్ తీవ్రంగా శ్రమిస్తోంది. నర్సిరెడ్డి తరపున సంఘం మండల శాఖలు మొదలు జిల్లా శాఖల బాధ్యులతో పాటు సంఘ సభ్యులందరూ ప్రతీ ఉపాధ్యాయుడిని కలిసి ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. ఆరేళ్లలో ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు, ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై, ప్రభుత్వ విద్య పరిరక్షణకు నర్సిరెడ్డి చేసిన కృషిని, పోరాటాన్ని వివరిస్తున్నారు. ఓ వైపు అభ్యర్థి నర్సిరెడ్డి ఉధృతంగా సమావేశాల్లో పాల్గొంటూ ప్రచారం చేస్తుండగా, మరోవైపున యూటీఎఫ్ సభ్యులు రాజకీయాలు, సంఘాలకతీతంగా ఉపాధ్యాయుల కోసం పనిచేసే నర్సిరెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న పీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నియోజకవర్గమంతా సమావేశాలు, సమ్మేళనాల్లో పాల్గొంటున్నారు. ఆయన పాల్గొనే కార్యక్రమాలతో పాటు ఆయన తరపున టీపీఆర్‌టీయూ నాయకులు, ఆయనకు మద్దతు ఇస్తున్న ఇతర సంఘాల నాయకులు ఎక్కడికక్కడ ఉపాధ్యాయులను...

– మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో గత ఏడాదికి భిన్నంగా ఫిబ్రవరి మాసంలోనే విద్యుత్‌కు భారీ డిమాండ్ పెరిగింది. ఒక్క నల్లగొండ జిల్లాలో ఈ నెలలో 1,002 మెగావాట్ల డిమాండ్‌కు విద్యుత్ చేరింది. ఇది ఆల్‌టైమ్ రికార్డ్ కాగా, ఈ డిమాండ్ ఈనెల 17న నమోదైంది. గత ఏడాది ఫిబ్రవరి 23 నాటికి 966 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది.

– (ఆంధ్రజ్యోతి,నల్లగొండ/నల్లగొండ టౌన్)



నల్లగొండ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ ముషారఫ్ ఫరూఖ్

విద్యుత్ డిమాండ్ @ 1,002 మెగావాట్లు



- ఇది ఆల్‌టైమ్ రికార్డు
- గత ఏడాది ఇదే నెలలో 966 మెగావాట్లు

ఉమ్మడి జిల్లాలో విద్యుత్ డిమాండ్ పెరగడంతో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖ్ గురువారం నల్లగొండలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి వేసవి కార్యాచరణ ప్రణాళికను సమీక్షించారు. గత ఏడాది ఓవర్‌లోడ్‌తో 67 పీటీఆర్ (పవర్‌ట్రాన్స్‌ఫార్మర్) సమస్యలు ఎదుర్కోగా, ప్రస్తుతం విద్యుత్‌శాఖ తీసుకున్న చర్యలతో ఎలాంటి ఓవర్‌లోడ్ లేకుండా చూస్తున్నారు. దీంతో విద్యుత్ కోతలు లేకుండా ప్రస్తుతం ఎలాంటి సమస్య లేకుండా సరఫరా అవుతోంది. ఇప్పటి వరకు హైదరాబాద్‌కే పరిమితమైన 1912 విద్యుత్ కాల్ సెంటర్‌ను జిల్లాల కూడా విస్తరిస్తున్నారు. విద్యుత్ అంతరాయాలు సమయంలో వెంటనే పరిష్కరించేందుకు అంబులెన్స్ తరహాలో ఈఆర్‌టీ (ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం)ను ఏర్పాటు చేయనున్నారు. వేసవి కార్యాచరణలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల తనిఖీకి సబ్‌స్టేషన్లను సందర్శిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

వేసవి ప్రణాళిక రూపొందించాం

– వెంకటేశ్వర్లు, ఎస్ఈ, నల్లగొండ

రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా వేసవి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. అంతేగాక అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడా విద్యుత్‌కు అంతరాయం తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. అదేవిధంగా ఈ ఏడాది మొత్తం 10 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఇప్పటికి నాలుగు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చాం.

8.24లక్షలకు పైగా వినియోగదారులు

నల్లగొండ జిల్లాలో మొత్తం 7,66,107మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. అందులో వ్యవసాయ వినియోగదారులు 2,37,660మంది, గృహ విద్యుత్ వినియోగదారులు 4,65,530 మంది, వాణిజ్య వినియోగదారులు 63,977మంది, పరిశ్రమలు 6,485 ఉన్నాయి. వీధి దీపాలు 8,372, వాటర్ వర్క్స్ కనెక్షన్లు 2,710, ఇతర వినియోగదారులు 1,373మంది ఉన్నారు. కొత్తగా మరో 20వేల మంది వినియోగదారులు చేరారు. జిల్లాలో గృహ, వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయరంగాలకు విద్యుత్ వినియోగం పెరిగింది. గృహజ్యోతి పథకం కింద జిల్లాలో 2.37లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. అదేవిధంగా ఈ ఏడాది 5,600 వ్యవసాయ కనెక్షన్లు నూతనంగా మంజూరయ్యాయి. గత సంవత్సరం 67 సబ్‌స్టేషన్ల పరిధిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఓవర్‌లోడ్ అయ్యాయి. డివిజన్ల వారీగా పెరుగుతున్న...

– మిగతా 7వ పేజీలో...

ఇసుక రవాణాపై నిఘా పెంచాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పాల్గొన్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, తదితరులు

నల్లగొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా నిఘా, తనిఖీలను పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఇసుక రీచ్‌ల నుంచి అనుమతి లేని వాహనాల్లో ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రీచ్‌ల వద్ద నైట్ విజన్ కెమెరాలతో పాటు, హైరిజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద డ్రోన్ సర్వే చేయిస్తామన్నారు. పరిమితికి మించి ఇసుక తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా గుర్తించిన ఇసుక రీచ్‌లను ఎంపీడీవోలు, తహసీల్దార్లు సంయుక్తంగా సందర్శించి వారంలోగా నివేదిక ఇవ్వాలన్నారు. దేవరకొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీన్ని అధికారులు సమన్వయంతో అడ్డుకోవాలన్నారు. జిల్లాలో 24 రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లను 31 గ్రామాల్లో నిర్మిస్తున్నారని, వాటికి మాత్రమే ఇసుకను మంజూరు చేయాలన్నారు. రీచ్‌ల వద్ద సాయంత్రం 5గంటల వరకు మాత్రమే ఇసుకను తవ్వేందుకు అనుమతి ఉందన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నాలుగు నెలల క్రితమే జాయింట్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, దేవరకొండ ఏసీపీ మౌనిక, మైనింగ్‌శాఖ సహాయ సంచాలకుడు జాకబ్, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

150 రోజులను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక

వేసవిలో తాగునీటికి సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎక్కడైనా తాగునీటి పైపులు, నల్లాలు, అత్యవసర మరమ్మతులు ఉంటే పంచాయతీ నిధుల నుంచి చేయించాలని ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రైవేట్ వ్యవసాయ బోర్లకు అనుమతి ఇస్తామన్నారు. రానున్న 150 రోజులను దృష్టిలో ఉంచుకొని సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ, మిషన్ భగీరథ గ్రిడ్‌లో సమస్యలు లేవని, అంతర్గత సరఫరాలో సమస్యలను గుర్తించామన్నారు. ఎక్కడైనా చేతి పంపులు, తాగునీటి పైప్ లైన్ల మరమ్మతులు ఉంటే వాటిని పూర్తిచేయాలన్నారు. మిషన్ భగీరథ ఈఈ వంశీ కృష్ణ మాట్లాడుతూ, వేసవి ప్రణాళికలో భాగంగా ప్లాన్ ఏ, బీ, సీ కార్యక్రమాలను వివరించారు.

పంటల మార్పిడితో ప్రయోజనం

(ఆంధ్రజ్యోతి, త్రిపురారం): పంటల మార్పిడితో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల పరిధిలోని కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో పత్తి అధిక సాంద్రత సాగు విధానంపై గురువారం ఒక్క రోజు నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆమె మాట్లాడారు. హైబ్రిడ్ వంగడాల సాగు, వ్యవసాయ అనుబంధ రంగాలపై రైతులు దృష్టి సారించాలన్నారు. అనంతరం కేవీకేలో వివిధ రకాల పంటల సాగును కలెక్టర్ పరిశీలించారు. అధిక సాంద్రత పత్తి సాగుపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేడీఏ శ్రవణ్‌కుమార్, శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రావు, లింగయ్య, చంద్రశేఖర్, రాములమ్మ, శ్రీధర్, మండల వ్యవసాయాధికారి పార్వతిచౌహాన్, పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆ సమయంలో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో ఆమె గురించి నైట్‌వాచ్‌మెన్‌ను ఆరా తీశారు. హాస్టల్‌లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లల విద్యా సామర్థ్యాలను పరిశీలించి వారికి చాక్‌లెట్లు అందజేశారు.

విద్యుత్ సమస్య లేకుండా చర్యలు

సీఎండీ ముషారఫ్ ఫరూఖ్

వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్య లేదన్నారు. వారం రోజుల నుంచి లోడ్ పెరుగుతోందని, గత ఏడాది ఫిబ్రవరి చివరి నాటి కంటే ఈసారి 1,002మెగావాట్ల అధిక వినియోగం జరిగిందన్నారు. ఏవైనా సమస్యలు వస్తే కలెక్టర్‌తో పాటు తన దృష్టికి తీసుకువస్తే సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లాలో అధునాతన సౌకర్యాలతో మోడల్ సబ్‌స్టేషన్ నిర్మించాలన్నారు. ప్రతీ సబ్‌స్టేషన్ డివిజన్ క్విక్ రెస్పాన్స్ వాహనం మంజూరు చేస్తున్నామని, జిల్లాకు తొమ్మిది వాహనాలు మంజూరు చేశామన్నారు. మార్చి 15లోగా ఇవి అందుబాటులోకి వస్తాయన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మోడల్ సబ్‌స్టేషన్‌కు స్థలాలు చూస్తామని, ఆటోచేంజ్ ఓవర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, విద్యుత్‌శాఖ డైరెక్టర్ నర్సింహ, సీఈలు భిక్షపతి, బాలకృష్ణ, ఎస్ఈ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులందరికీ న్యాయం చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గుడితండా వాసులు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పెండ్లిపాకల రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న గుడితండాలో అర్హులకు న్యాయం చేయాలని పునర్నిర్మాణ సమగ్ర అభివృద్ధి సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పెండ్లిపాకల రిజర్వాయర్‌లో గ్రామం పూర్తిగా ముంపునకు గురవుతున్నందున గతంలో అధికారులు సర్వే నిర్వహించి అవార్డు ప్రకటించారని తెలిపారు. అందులో పలు అవకతవకలు జరగ్గా, గ్రామకమిటీ తరపున వినతిపత్రం అందజేయగా, రీసర్వే నిర్వహించారన్నారు. అయితే రీసర్వే పూర్తవకుండానే ఈనెల 17న అవార్డు ప్రకటించగా, అందులో అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. తక్షణమే పూర్తిస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్.సుభాష్‌చంద్రబోస్, మాత్యనాయక్, హనుమ, బాలునాయక్, సక్కునాయక్, వెంకట్, రాంచంద్రనాయక్, పాల్గొన్నారు.

మృతదేహంతో స్టేషన్ ఎదుట

ఆందోళన

- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్
- ఈ నెల 2న రోడ్డు ప్రమాదం.. చికిత్స పొందుతూ మృతి

●6లో..

కష్టపడి చదివి

ఉన్నత స్థానాలకు చేరాలి

- మాండ్య విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.శివ చితప్ప

●6లో..

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం



మహాసభల్లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల రెండో రోజు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో ఎంజీ యూనివర్సిటీకి రూ.1,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీలకు వీసీలను నియమించినా, అభివృద్ధికి మాత్రం నిధులు కేటాయించలేదన్నారు. యూనివర్సిటీల్లో నిధులు లేక కొన్ని కోర్సులు ఎత్తివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగానే మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెరిగాయన్నారు. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులను బోర్డు, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు పదో తరగతి టాలెంట్ టెస్టులు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోడల్ ఎంసెట్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పలు అంశాలపై సెమినార్లు, అవగాహన సదస్సులు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. మహాసభల్లో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, నాయకులు శ్రీకాంత్, ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, మారుపాక కిరణ్, పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్టు

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్న ఓ వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే ఎస్‌ఐ బొడిగె రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున నల్లగొండ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం-1పై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఆర్‌పీఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకొని విచారించారు. జనగామ జిల్లా లింగాల ఘన్‌పూర్‌కు చెందిన పందిబోటి రాజుగా గుర్తించారు. అతని జేబులో మూడు సెల్‌ఫోన్లు దొరకడంతో ఎక్కడి వని విచారించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి గుంటూరుకు వెళ్లే రైళ్లలో నల్లగొండ రైల్వేస్టేషన్‌కు వచ్చే సరికి ప్రయాణికుల వద్ద నుంచి సెల్‌ఫోన్లు చోరీ చేసినట్లు అంగీకరించాడని రైల్వే పోలీసులు తెలిపారు. రూ.15వేల విలువైన మూడు సెల్‌పోన్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని నాగులపహాడ్ గ్రామానికి చెందిన వృద్ధురాలిపై గురువారం కోతులు దాడి చేశాయి. గ్రామానికి చెందిన మీసాల యల్లమ్మ ఇంటి ముందు ఉండగా కోతుల మంద దాడి చేసింది. కుటుంబసభ్యులు ఆమెను మండలకేంద్రంలోని ఆరోగ్యకేంద్రంలో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం బాధితురాలిని సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. మండలంలోని పలు గ్రామాల్లో కోతులు అధికంగా తిరుగుతూ దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన కుమార్తె



తుర్కపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తల్లికి తలకొరివి పట్టి కొడుకుల్లేని లోటును తీర్చింది ఓ కూతురు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం చిన్నలక్ష్మాపూర్ గ్రామంలో గురువారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన పులిగిల్ల దేవయ్య భార్య కనకమ్మ(35) దంపతులది నిరుపేద కుటుంబం. ఈ దంపతులకు ఒక్కతే కూతురు కావ్య మాదాపూర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కాగా దేవయ్య భార్య కనకమ్మ గుండె సంబంధిత వ్యాధితో ఆరు నెలలుగా మంచానికే పరిమితమైంది. భర్త దేవయ్య హైదరాబాద్ పంజగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించాడు. ఆమె పరిస్థితి విషమించడంతో ఇంటికి పంపించారు. బుధవారం రాత్రి కనకమ్మ ఇంట్లో మృతిచెందింది. తల్లికి తలగొరు పట్టి ముందు నడుస్తున్న కావ్యను చూసి గ్రామస్థులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కూచిపూడి గ్రామానికి చెందిన శెట్టి శ్రీనివాసరావు గురువారం ట్రాక్టర్‌పై కోదాడకు వస్తుండగా, నల్లబండగూడెం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న శ్రీనివాసరావు, స్కూటీ నడుపుతున్న నాగేశ్వరరావు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

తిరుమలగిరి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన దుండగులను సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఏఎస్‌ఐ నికోలస్ తెలిపిన వివరాల ప్రకారం... తిరుమలగిరిలో గురువారం తెల్లవారుజామున పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, బైక్‌లపై వస్తున్న వారిఐ అనుమానం వచ్చి విచారించారు. వీరు మునిసిపాలిటీ పరిధి నందాపురం గ్రామ సమీపంలోని పురాతన దేవాలయంలో తవ్వకాలు జరిపినట్లు విచారణలో తేలిందని తెలిపారు. నిందితుల నుంచి బైక్‌లు, గడ్డపారలు, పారలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో జనగామ జిల్లా దేవరుప్పలకు చెందిన ఎండీ. సుభాన్, మార్గం ఉప్పలయ్య, యాదాద్రి జిల్లా మోత్కూరుకు చెందిన ఎస్‌కే. మదార్, తిరుమలగిరి మండలానికి చెందిన కన్నెబోయిన మల్లయ్య, ఎస్‌కె మదార్, మల్లయ్య, యాకూబ్ ఉన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కోదాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చికిత్సపొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడలో గురువారం జరిగింది. హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామానికి చెందిన గూడెపు నాగేశ్వరరావు(48) అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ నాగేశ్వరరావు బుధవారం రాత్రి మృతిచెందాడు. సరైన వైద్యం అందక నాగేశ్వరరావు మృతిచెందాడని బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. భార్య కనకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



మర్రిగూడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో జింక గాయపడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామెర బీమనపల్లి గ్రామ శివారులో గురువారం జరిగింది. దామెర బీమనపల్లి గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో జింక సంచరిస్తుండగా కొన్ని కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. రైతులు కుక్కలను తరిమికొట్టారు. జింకగాయపడిన విషయాన్ని రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన జింకను మర్రిగూడ పశువైద్యశాలకు తరలించారు. డాక్టర్ సురేందర్ జింకకు ప్రథమ చికిత్స చేశారు. రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు మునుగోడు ఆఫీసర్ రాములు తెలిపారు. మూడు సంవత్సరాల వయస్సున్న జింక ప్రస్తుతం తమ ఆధీనంలో ఉందని తెలిపారు.

హరితహారం చెట్లు నరికిన వారిపై కేసు నమోదు

మర్రిగూడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని వట్టిపల్లి గ్రామ పరిధిలోని నీలకంఠ రామలింగేశ్వరస్వామి దేవాలయ దేవాదాయశాఖకు సంబంధించిన భూమిలో గత నెల 29న హరితహారం చెట్లను కొందరు నరికి వేశారు. ఈ సంఘటనకు సంబంధించి వట్టిపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ వంశీకృష్ణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

‘థార్’ గ్యాంగ్ సూత్రధారి అరెస్టు

● మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అష్రఫ్‌ఖాన్ అరెస్టు ● నార్కట్‌పల్లి ట్రావెల్స్ బస్సులో రూ.25లక్షల నగదు తస్కరించింది ఈ ముఠానే ● పరారీలో ముగ్గురు ముఠా సభ్యులు



రికవరీ చేసిన రూ.25లక్షల నగదు చూపుతున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా 'థార్ గ్యాంగ్‌కు చెందిన ప్రధాన నిందితుడు మహ్మద్ అష్రఫ్‌ఖాన్‌ను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని థార్ జిల్లాకు వెళ్లిన నల్లగొండ జిల్లా పోలీసులు ఒకరిని అరెస్టుచేయగా, ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. కేసుకు సంబంధించిన వివరాలను గురువారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ వెల్లడించారు.

నార్కట్‌పల్లి ఘటనతో దర్యాప్తు ముమ్మరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కేంద్రానికి చెందిన బోయిన వెంకటేశ్వర్లు హైదరాబాద్‌లోని మారీ టెక్ సంస్థ యజమాని దామోదర్‌రెడ్డికి సంబంధించిన భూమిని విక్రయించగా వచ్చిన రూ.25లక్షల నగదును చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే శ్యామ్ సర్దార్ ట్రావెల్స్ బస్సులో తీసుకెళుతున్నాడు. హైదరాబాద్‌కు వెళ్తున్న ఈ ట్రావెల్స్ బస్సును ఈ నెల 9వ తేదీన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి సమీపంలోని పూజిత హోటల్ వద్ద ఉదయం 9 గంటల సమయంలో అల్పాహారం కోసం నిలిపారు. ఆ సమయంలో వెంకటేశ్వర్లు బస్సు దిగి మూత్ర విసర్జన అనంతరం బస్సు ఎక్కి తన బ్యాగులో ఉన్న రూ.25 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే వెంకటేశ్వర్లు నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పూజిత హోటల్‌తోపాటు పరిసరాల్లో ఉన్న సీసీకెమెరా ఫుటేజీలను పరిశీలించగా మారుతి సుజుకీ ఫ్రాంక్స్ వాహనంలో నలుగురు వచ్చినట్లు గుర్తించారు. ఆ వాహనంలో నుంచి ఓ వ్యక్తి దిగి హోటల్ వద్ద నిలిపి ఉంచిన బస్సులోకి ఎక్కి నగదుతో ఉన్న బ్యాగును తీసుకుని కిందికి దిగి కారులో హైదరాబాద్ వైపు వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

నిందితుడు చిక్కాడిలా..

నార్కట్‌పల్లిలోని పూజిత హోటల్ వద్ద ఉన్న బస్సులో బ్యాగు చోరీ చేసిన నిందితులను గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. ఫుటేజీ ఆధారంగా నలుగురు వ్యక్తులను గుర్తించి ఆ ఫొటోలను అన్ని క్రైం టీమ్‌లకు పంపారు. సీసీ కెమెరాలో గుర్తించిన వ్యక్తుల ఫొటోలను పాత నేరస్థుల ఫొటోలతో సరిపోల్చగా వీరు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన థార్ గ్యాంగ్‌కు చెందిన సభ్యులుగా నల్లగొండ సీసీఎస్ పోలీసులు గురించారు. నిందితులను పట్టుకునేందుకు సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్‌గిరి, రబ్బాని, పుష్పగిరి, సత్యనారాయణతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ముఠాలో ప్రధాన నిందితుడైన మహ్మద్ అష్రఫ్‌ఖాన్‌ముల్తానిని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని థార్ జిల్లా మున్వర్ తాలుకా కేద్వా జాగీర్ గ్రామంలో(రాళ్ల ముండల్) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతని వద్ద రూ.25లక్షల నగదుతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అక్కడి కోర్టులో హాజరుపరిచి గురువారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. మహ్మద్ అష్రఫ్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకోగా, అదే ప్రాంతానికి చెందిన లైట్ ఖాన్, అక్రమ్ ఖాన్, మహబూబ్ ఖాన్ పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి..

థార్ గ్యాంగ్‌కు చెందిన ప్రధాన నిందితుడు మహ్మద్ అష్రఫ్‌ఖాన్, లైట్‌ఖాన్, అక్రమ్‌ఖాన్, మహబూబ్ ఖాన్ జల్సాలకు అలవాటు పడి అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలని సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్ నుంచే దొంగతనాలు చేయడం ప్రారంభించారు. పలుమార్లు అక్కడ చోరీలు చేసి జైలుకు కూడా వెళ్లి వచ్చారు. సొంత రాష్ట్రంలో అయితే పోలీసులు పట్టుకుంటున్నారనే ఆలోచనతో ఇతర రాష్ట్రాల్లో చోరీలు చేసేందుకు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా హైవేలో రోడ్ల వెంట ప్రయాణిస్తూ రోడ్డు పక్కన ఉండే పెద్ద పెద్ద హోటళ్ల వద్ద ఆగి అక్కడికి వచ్చే ట్రావెల్స్ బస్సులను గుర్తించి బస్సులోని ప్రయాణికులు టిఫిన్, కాలకృత్యాల కోసం దిగగానే వీరు బస్సులోకి ఎక్కి చోరీలకు పాల్పడతారు. ఈ నెల 9వ తేదీన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని పూజిత హోటల్ వద్ద ట్రావెల్స్ బస్సులో ఇదే తరహాలో చోరీ చేసి రూ. 25లక్షలు చోరీ చేసి పరారయ్యారని, సీసీ కెమెరాల ద్వారా గుర్తించి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని థార్ జిల్లాలో ప్రధాన నిందితుడు మహ్మద్ అష్రఫ్‌ఖాన్‌ను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అతనిపై గతంలో మహారాష్ట్రలోని పూణే, ఇండోర్ జిల్లాలోని సిమ్రోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలు, నేరాలు, మునవర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దాడి కేసులు నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు.

సెటిల్‌మెంట్లే తప్ప కేసులు, అరెస్టులు తక్కువ..

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని థార్ జిల్లాకు చెందిన గ్యాంగ్ పలు చోరీలు, నేరాలకు పాల్పడింది. వీరు చోరీలకు, నేరాలకు పాల్పడిన తర్వాత వీరిని పట్టుకునేందుకు పోలీసులకు సవాల్‌గానే మారింది. గ్యాంగ్ నివాసం ఉండే ప్రాంతం గుట్టపై భాగంలో ఉండడంతో అక్కడి వెళ్లి అరెస్టు చేయాలంటే అక్కడి పోలీసులు కొంత సాహసం చేసేవారని ఎస్పీ తెలిపారు. ఈ గ్యాంగ్‌కు చెందిన ముఠా సభ్యులు చోరీచేసి ఇంటికి వచ్చిన తర్వాత గ్రామస్థులు, ఇతర పెద్ద మనుషులు కలిసి చోరీ చేసిన సొత్తునైనా ఇవ్వడం.. సెటిల్‌మెంటైనా చేసి పంపిస్తారని, అరెస్టులు, రిమాండ్‌లు తక్కువేనని ఎస్పీ పేర్కొన్నారు.

నల్లగొండ జిల్లా పోలీసుల సాహసం

నల్లగొండ జిల్లా సీసీఎస్ ప్రత్యేక బృందం మధ్యప్రదేశ్‌లోని పోలీస్ ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీ, స్థానిక పోలీసుల సహకారంతో గ్యాంగ్ ప్రధాన నిందితుడైన మహ్మద్ అష్రఫ్‌ఖాన్‌ను అరెస్టుచేసి రూ.25లక్షల నగదును రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని తెలి పారు. నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి పర్యవేక్షణలో మధ్యప్రదేశ్ వెళ్లిన నల్లగొండ జిల్లా పోలీసుల బృందాన్ని ఎస్పీ అభినందించారు.

మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

● కుటుంబానికి న్యాయం చేయాలని బంధువుల డిమాండ్ ● మూడు గంటల పాటు ధర్నా ● పోలీసుల హామీతో విరమణ

నిడమనూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట మూడు గంటల పాటు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలకేంద్రంలో గురువారం జరిగింది. మండలంలోని గుంటుగూడెం గ్రామానికి చెందిన గోపిశెట్టి శ్రీనయ్య(57) గత నెల 2వ తేదీన మండలకేంద్రానికి వచ్చి పని ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరుగుపయనమయ్యాడు.గుంటుకగూడెం-ముప్పారం రోడ్డులో మూలమలుపు వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న సీబీజడ్ వాహనం ప్రమాదవశాత్తు శ్రీనయ్యను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం తొలుత మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యంకోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని కాచిగూడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నెలన్నర రోజులకు పైగా చికిత్సపొందుతూ శ్రీనయ్య గురువారం మృతిచెందాడు. ఆస్పత్రిలో శ్రీనయ్య చికిత్స కోసం కుటుంబ సభ్యులు పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. ప్రమాదానికి కారణమైన మండలంలోని వడ్డెరగూడెం గ్రామానికి చెందిన గోగుల మహేష్‌ను పిలిపించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ ఎదుట సుమారు మూడు గంటల పాటు ఆందోళన చేశారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పిలిపించి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని ఎస్‌ఐ గోపాల్‌రావు చెబుతున్నా ఆందోళనకారులు ససేమిరా అంటూ ఆందోళన కొనసాగించారు. దీంతో సంఘటన గురించి ఎస్‌ఐ ఉన్నతాధికారులకు వివరించడంతో హాలియా సీఐ జనార్దన్‌గౌడ్ సంఘటనాస్థలానికి వచ్చి ఆందో ళన చేస్తున్న వారితో మాట్లాడారు. గత నెల 12వ తేదీన శ్రీనయ్య కుమార్తె లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన మహేష్‌ను శుక్రవారం స్టేషన్‌కు పిలిపించి బాధితులకు న్యాయం చేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆందోళన కార్యక్రమంలో గుంటుకగూడెం మాజీ సర్పంచ్ గుడిసె శంకరయ్య, అక్కి శ్రీనివాస్, కడెం తిరుపతిరావు, గోపిశెట్టి రవి, యాదిగిరి ఉన్నారు.


ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

పైర్లు ఎండుతున్నా పట్టించుకోరా?

ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ అధికారుల తీరుతో గోదావరి జలాలు రాక పైర్లు ఎండుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారి కోటినాయక్‌తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వ వంతెనపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆత్మకూరు(ఎస్) మండలం కోటినాయక్‌తండా వద్ద ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ డీబీఎం-71కు నీటిపారుదల శాఖ అధికారులు నాలుగు రోజుల క్రితం నీటిని విడుదల చేశారని, నేటికీ పెన్‌పహాడ్ మండలానికి నీళ్లు చేరలేదన్నారు. వారబందీ ప్రకారం ఈ నెల 16న గోదావరి జలాలు విడుదల చేసిన అధికారులు ప్రధాన కాలువకు నీటిని అందించకుండా 36ఎల్ కాల్వ ద్వారా మోతె మండలానికి మాత్రమే నీళ్లు తరలించడంపై నిరసన వ్యక్తం చేశారు. అధికారులు నీటి సరఫరాలో పక్షపాతం చూపిస్తున్నారని రాత్రి వేళల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మెయిన్ కాలువ గేట్లు మూసి నీటిని మళ్లిస్తున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు 10రోజుల క్రితం ప్రధాన కాల్వ గేట్లకు ఏకంగా వెల్డింగ్‌లు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వదిలిన కొద్ది నీరైనా అన్ని ప్రాంతాల రైతులకు సమానంగా చూడాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఘటనా స్థలానికి రావాలని డిమాండ్‌చేస్తూ గంట పాటు ఆందోళన చేయడం తో కిలోమీటరు మేర వాహనాలు స్తంభిం చాయి. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈ రమేష్ తమ సిబ్బంది ఏఈ లింగయ్య, రాములునాయక్, మల్లికార్జున్‌తో వచ్చి మీ ప్రాంతానికి నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. అనంతరం మూసివేసి ఉన్న ప్రధాన కాల్వ గేట్లను క్రేన్ ద్వారా తీయడంతో మెయిన్ కెనాల్ నుంచి నీటి సరఫరా ప్రారంభమైంది.


ఆత్మకూర్(ఎస్) మండలం కోటినాయక్ తండ వద్ద ఎస్సారెస్పీ నీటి కోసం ధర్నా చేస్తున్న రైతులు

లింగన్నా.. మళ్లొస్తాం



» ముగిసిన పెద్దగట్టు జాతర

» స్వామిని దర్శించుకున్న 16లక్షల మంది భక్తులు

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర గురువారం ముగిసింది. ఆనవాయితీ ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామం నుంచి సూర్యాపేట జిల్లా కేసారం గ్రామానికి చెందిన మెంతెబోయిన వంశస్థుల ఇంటికి తీసుకొచ్చిన దేవరపెట్టెను బుధవారం రాత్రి కేసారం మీదుగా చీకటాయపాలెం తరలించారు. గురువారం మధ్యాహ్నం మకర తోరణాన్ని సూర్యాపేట పట్టణంలోని గొల్లబజారును దేవరగుడికి, పసిడి కుండను చివ్వెంల మండలం ఖాసింపేటలోని రామాలయానికి పసిడికుండను తరలించారు. గురువారం కూడా లింగమంతుల స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఐదు రోజుల జాతరలో సుమారు 16లక్షల మంది భక్తులు హాజర య్యాయని అధికారులు అంచానా వేశారు. జాతరకు ప్రభుత్వం రూ.5కోట్లు కేటాయించింది. సల్లంగ చూడు లింగన్నా.. మళ్లొస్తాం.. అంటూ భక్తులు ఇంటి బాట పట్టారు.



కోనేరులో పుణ్య స్నానాలు

ఈ దఫా కోనేరుతో పాటు గుట్టపైన ఏర్పాటు చేసిన స్నాన కుళ్లాయిలలో తలనీలాలు సమర్పించి భక్తులు పుణ్యస్నానాలు చేశారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అధికారులు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారి ంచడంలో మునిసిపల్ యంత్రాంగం విజయవంతమైంది. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించారు. మర్రిచెట్టు సమీపంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ సహా స్టాఫ్‌నర్సు, సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండి భక్తులకు సేవలు అందించారు. జీవాలను బలి ఇచ్చిన తర్వాత రక్తాన్ని జెట్టింగ్ మిషన్ పీల్చుకుంటుందని చెప్పినా పెద్దగా పనిచేయలేదు.

పెరిగిన హుండీ ఆదాయం

జాతర హుండీలను గురువారం లెక్కించారు. గత జాతరకు రూ.25,71,294లు రాగా, ప్రస్తుత జాతరకు రూ.31,29,686లు వచ్చాయి. ఈసారి రూ.5,58,392 ల ఆదాయం పెరిగింది. 425గ్రాములు మిశ్రమ వెండి వచ్చింది. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్. కృష్ణయ్య, చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, దేవాదాయ శాఖ పరిశీలకులు కుశలయ్య, ధర్మకర్తలు వీరబోయిన సైదులు, కుర్ర సైదులు యాదవ్, మెంత బోయిన లింగస్వామి, చిన్న మల్లయ్య, నరేష్‌పిళ్ళే సైదమ్మ పాల్గొన్నారు.


స్వామీ.. సల్లంగ చూడు


జాతరకు వచ్చిన యువకుల ఉత్సాహం


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


తిరుగు పయనమవుతున్న భక్తులు

పట్టణాల్లో దుకాణాలకు
ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

● లైసెన్స్ ఉంటేనే బ్యాంకు రుణాలకు అవకాశం
● 'సిరిసిల్ల' ఘటనతో సర్వత్రా చర్చనీయాంశం



భువనగిరి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో దుకాణాలు, హోటళ్లు సహా అన్ని వ్యాపారాలకు మునిసిపాలిటీ జారీ చేసిన ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి. ట్రేడ్ లైసెన్స్ ఉంటేనే బ్యాంకు రుణాలకు అవకాశం ఉంటుంది. ట్రేడ్ లైసెన్స్ ఉంటేనే ప్రమాదాలు జరిగినప్పుడు బీమా, నష్టపరిహారం లభిస్తుంది. అంతేగాక ట్రేడ్ లైసెన్స్ ద్వారా మునిసిపాలిటీలకు ఆదాయం లభిస్తుంది. ట్రేడ్ లైసెన్స్ పొందని దుకాణాలను సీజ్ చేసే అధికారం అధికారులకు ఉంటుంది. దీంతో సుమారు అన్ని దుకాణాల యజమానులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకుంటారు. కానీ మరికొందరు మాత్రం అవగాహనాలోపం లేదా నిర్లక్ష్యంతో లైసెన్స్‌ను తీసుకోవడానికి ఆసక్తి చూపరు. అయితే సిరిసిల్లలో ట్రేడ్ లైసెన్స్ లేని ఓ టీస్టాల్‌ను అక్కడి కలెక్టర్ సందీప్‌కుమార్ సీజ్ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అంతేగాక రాజకీయ దుమారాన్ని లేపింది. దీంతో ట్రేడ్ లైసెన్స్ రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఆన్‌లైన్‌లోనే ట్రేడ్ లైసెన్స్‌లు

గతంలో ఆఫ్‌లైన్‌లో ట్రేడ్ లైసెన్స్‌లను జారీ చేసేవారు. అలాగే ట్రేడ్ లైసెన్స్‌లపై మునిసిపల్ సిబ్బంది పర్యవేక్షణ, తనిఖీలు కూడా నామమాత్రంగానే ఉండేవి. దీంతో పట్టణమంతటా దుకాణాలు ఉన్నప్పటికీ మునిసిపాలిటీకి ట్రేడ్ లైసెన్స్ రూపంలో లభించే ఆదాయం నామమాత్రంగానే ఉండేది. ఈ నేపథ్యంలో ట్రేడ్ లైసెన్స్ విధానాన్ని పటిష్ఠం చేస్తే ఆన్‌లైన్‌లో లైసెన్స్ జారీ విధానాన్ని ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం అమల్లోకి తెచ్చింది. లైసెన్స్ ఫీజులను కూడా కేటగిరివారీగా నిర్ణయించారు. ప్రతీ దుకాణాదారులు ప్రతి సంవత్సరం ట్రేడ్ లైసెన్స్‌ను రెన్యూవల్ చేసుకునేలా నిబంధనలను పటిష్ఠం చేశారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

ట్రేడ్ లైసెన్స్‌కోసం దుకాణాదారుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తు సంబంధిత మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాగిన్‌లోకి చేరుతుంది. దరఖాస్తు ఆధారంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ క్షేత్ర పరిశీలన చేస్తారు. దుకాణం ప్రారంభించే మడిగె లేదా భవనానికి తప్పనిసరిగా ఇంటి నెంబర్ ఉండాలి. ఆస్తిపన్ను అప్‌డేట్‌గా ఉండాలి. అద్దె మడిగె అయితే భవన యజమాని అగ్రిమెంట్ ఇవ్వాలి. మడిగ యజమానే దుకాణం పెట్టాలనుకుంటే మునిసిపాలిటీ జారీ చేసే ఓనర్‌షిప్ సర్టిఫికెట్ జతచేయాలి. జాతీయ రహదారి వెంట దుకాణాలకు ఫీట్‌కు రూ.5, రెండు రహదారులు ఉంటే ఫీట్‌కు రూ.4, సింగల్ రోడ్డుకు ఫీట్‌కు రూ.3 లైసెన్స్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రతీ సంవత్సరం అదే చార్జీలతో రెన్యూవల్ చేసుకోవడం తప్పనిసరి.

డబ్బా దుకాణాలకు తాత్కాలిక లైసెన్స్‌లు

పక్కా భవనాల్లో ఏర్పాటు చేసే దుకాణాలకు శాశ్వత ట్రేడ్ లైసెన్స్‌లను జారీచేస్తారు. పలు కారణాలతో పట్టణంలోనే ఇతర ప్రాంతాల్లోకి దుకాణాలను తరలిస్తే ఆ వివరాల ఆధారంగా లైసెన్స్ మార్పు చేసుకోవాలి. కానీ డబ్బా దుకాణాలను ఇంటి నెంబర్లు కేటాయించే అవకాశం లేనందున వాటికి తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్‌లను జారీచేస్తారు. చార్జీలను ఇతర నిబంధనలన్నీ యథావిధిగానే ఉంటాయి. ఇటీవల పట్టణాల్లో డబ్బా దుకాణాలలో చాయ్ అడ్డాలతో ఇతర దుకాణాలు పెరుగుతున్నాయి. కానీ ఈ తరహా దుకాణాలు ట్రేడ్ లైసెన్స్‌లను తీసుకుంటున్న దాఖలాలు లేవని పలువురు అంటున్నారు. భువనగిరి మునిసిపల్ పరిధిలో 1,467 ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయి. లైసెన్స్‌లు పొందని మరిన్ని దుకాణాలు, డబ్బా దుకాణాలు ఉంటాయని మునిసిపల్ సిబ్బంది అంటున్నారు. ఇదే తరహా పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో ఉంటున్నది. అయితే విధిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని, రెన్యూవల్ చేసుకోవాలని భువనగిరి మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం సూచిస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్‌లతో యజమానులకు భద్రత ఉంటుందన్నారు.

రెండోరోజుకు సంప్రోక్షణ మహోత్సవాలు

● హవనాలు, జపాలతో కొనసాగిన వేడుకలు ● తిరువీధి సేవలో యాగశాలకు ఉత్సవమూర్తులు ● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





హోమం నిర్వహిస్తున్న అర్చకులు, వేడుకలకు సిద్ధమైన స్వర్ణ దివ్య విమాన రాజగోపురం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యాదగిరీశుడి స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు రెండోరోజుకు చేరాయి. గురువారం వేదపండితులు, రుత్వికుల వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ హవనాలు, జపాలు వైభవంగా నిర్వహించారు. నిత్యారాధనల అనంతరం తిరువీధి సేవతో యాగశాలకు ఉత్సవమూర్తులను చేర్చారు. ఒకవైపు హవనాలు కొనసాగుతుండగా మరోవైపు వేద, ఇతిహాస, రామాయణ, భాగవత, పురాణ స్తోత్ర పారాయణాలు, మూలమంత్ర, మూర్తి మంత్ర హవనాలు నిర్విరామంగా కొనసాగాయి. నిత్య పూర్ణాహుతి, నివేదన, నీరాజన మంత్రపుష్పం, శాత్తుముర్రై, తీర్థప్రసాదగోష్ఠి చేపట్టారు. సాయంత్రం విష్ణు సహస్ర పారాయణాలు, ద్వారాది కుంభార్చన, బింబ, కుంభ, మండల, అగ్ని ఆరాధన, మూర్తి మంత్ర హవనాలు, ఛాయాదివాసం, నిత్య పూర్ణాహుతి, నివేదన చేపట్టిన అర్చకులు తిరువీధి సేవతో ఉత్సమూర్తులను ఆలయ ప్రవేశం చేశారు.

నది తీర్థ జలాలు

స్వర్ణ గోపురం మహాకుంభాబిషేక మహోత్సవానికి 2025 జనవరి 30న, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.శ్రీధర్, కలెక్టర్ హనుమంతరావు జెండా ఊపి ప్రారంభించగా ఆలయం నుంచి పూజారులు నది జలాల సేకరణకు వెళ్లారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని గోదావరి, పెన్‌గంగ, యమున, గంగ, ప్రయాగరాజ్ త్రివేణి సంగమం (గంగ, యమున, సరస్వతి), సరయూ, గోమతి, నర్మద, మంజీర, తాలిపేరు, హరిద్రా, కృష్ణ, తుంగ, భద్ర మొత్తం 14 నదులనుంచి జలాలు సేకరించి గురువారం యాగశాలకు చేరుకున్నారు. సేకరించిన నది జలాలను యజ్ఞశాలలోని కలశంలో కలిపారు.

ఛాయాధివాసం ప్రత్యేకత

భగవంతుని దివ్య స్వరూపాన్ని ఒక దర్పణంలో దర్శింపజేస్తూ చూడముచ్చటగా ఈ వేడుక నిర్వహించారు. బింబ, ప్రతిబింబ భావంతో ఛాయా స్వరూపంలో భగవంతుడిని దర్శించుట ఎంతో అపూర్వమైందని రుత్వికులు వివరించారు. ప్రధానార్చకులు నల్లన్‌థిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఉపప్రధానార్చకులు భట్టర్ సురేంద్రచార్యులు, కొడకండ్ల మాధవచార్యులు యజ్ఞాచార్యులు, అర్చక బృందం, రుత్వికులు, వేద పండితులు పాల్గొన్నారు. వేడుకల్లో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఆలయ ఈవో భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కర శర్మ, ఏఈవో ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వెల్లి రమేష్ బాబు, రఘు, పర్యవేక్షకులు రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, దీరావత్ రామరావునాయక్ పాల్గొన్నారు.

సంగీత సభలు

సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా సంగీత సభలు నిర్వహించారు. సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు జొన్నలగడ్డ సత్య శ్రీరామ్, కర్ణాటక సంగీతం, 7 నుంచి 8 గంటల వరకు వనజ ఉదయ్ బృందం కూచిపూడి నృత్యం, 8 నుంచి 9 గంటల వరకు లోహిత చలసాని బృందం కూచిపూడి నృత్యం ఆకట్టుకున్నాయి.

ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక మహోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో భువనగిరి జోన్ డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర గురువారం కొండపై ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటి వరకు చేపట్టిన, ఇక ముందు చేపట్టాల్సిన ఏర్పాట్లు, ఆలయ పరిసరాలను తనిఖీ చేశారు. స్వర్ణ విమాన రాజగోపుర మహాకుంభాబిషేకోత్సవానికి సీఎం పైకి ఎక్కేందుకు మెట్లదారిని ఏర్పాటు చేయగా, దానిని పరిశీలించారు. ఈ నెల 23న యాదగిరిగుట్టకు సీఎం రానుండగా, మార్చి ఒకటో తేదీ నుంచి స్వామివారి వార్షిక బ్రహోత్సవాలకు అవసరం మేరకు రంగులు పూర్తి చేశారు. ఘాట్ రోడ్డువెంట రిటైనింగ్ వాల్‌కు రంగులు వేస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వీఐపీ, దాతలకు తూర్పు రాజగోపురం ఎదురుగా కూర్చునేందుకు వీలుగా సిద్ధం చేస్తున్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమ శాస్త్ర రీతిలో నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామి అమ్మవారలను సుప్రభాతసేవతో మేల్కొలిపి అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు సాంప్రదాయరీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు రూ.15,32,955 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

23 నుంచి మహా శివరాత్రోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి క్షేత్రంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి శివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. 23 నుంచి 28 వరకు పాంచాహ్నిక దీక్షతో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ నెల 23న ఉదయం 11.30 గంటలకు స్వస్తివాచనం, 24న ధ్వజారోహణం, భేరీపూజ, దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ, 25న ఉదయం 10 గంటలకు రుద్ర హవనం, రాత్రి 7 గంటలకు పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. 26న (మహాశివరాత్రి) అభిషేకాలు, రాత్రి లింగోద్భవ కాలంలో మహన్యాస పూర్వక శతరుద్రాభిషేకాలు, 27న ఉదయం 11 నుంచి 2 గంటల వరకు లక్షబిల్వార్చన, రాత్రి 7.40గంటలకు రామలింగేశ్వరుని రథోత్సవం, 28న పూర్ణాహుతి, ఉత్సవ పరిసమాప్తి జరగునున్నట్లు వివరించారు.

తేదీ	కైంకర్యం	టికెట్‌ధర
25	కల్యాణం	రూ.500
26	అభిషేకం	రూ.300
	శతరుద్రాభిషేకం	రూ.500
27	లక్ష బిల్వార్చన	రూ.516

సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి ఆహ్వానం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి స్వర్ణ దివ్య విమాన రాజగోపురం మహాకుంభాభిషేక మహోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తూ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానపత్రిక అందజేశారు. గురువారం ఈ మేరకు సీఎం నివాసంలో కలిసి ఈ నెల 23న యాదగిరిగుట్టకు రావల్సిందిగా కోరారు. ఆహ్వానం అందజేసిన వారిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యార్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవస్థాన ఈవో ఏ. భాస్కర్‌రావు, పర్యవేక్షకులు రాజన్‌బాబు, ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు, కిరణ్‌కుమారచార్యులు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి స్వామివారి ప్రసాదం అందజేస్తున్న మంత్రి సురేఖ, చిత్రంలో సీఎస్ శాంతికుమారి, విప్ బీర్ల అయిలయ్య, దేవస్థాన ఈవో భాస్కర్‌రావు

విద్యుత్ డిమాండ్ @1,002 మెగావాట్లు

(5వపేజీ తరువాయి)

లోడ్‌కు తగ్గట్టు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లు, ఫీడర్లను విభజిస్తున్నారు. అదేవిధంగా వేసవి ప్రణాళికలో భాగంగా నల్లగొండ జిల్లాలో అదనంగా 2,900 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాదిలో మొత్తం కొత్తగా 10 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. అందులో ఇప్పటికే నాలుగు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయగా, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఇదిలా ఉంటే డిమాండ్ ఎంత పెరిగినా ఓవర్‌లోడ్ సమస్యలు రాకుండా విద్యుత్‌శాఖ పరంగా ఎలాంటి సమస్యలు లేకుండా ఉండేకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. యాసంగి, ఎండకాలం సీజన్ ముగిసే వరకు అధికారులకు, సిబ్బంది ఎలాంటి సెలవులు మంజూరు చేయరాదని శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

మండుతున్న ఎండలు కూడా కారణమే

జిల్లాలో రోజురోజుకూ ఎండలు మండుతుండటం కూడా విద్యుత్ వినియోగానికి కారణమైంది. జిల్లాలో 35 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అదేవిధంగా యాసంగి వ్యవసాయ కార్యకలాపాలకు కూడా విద్యుత్ వినియోగం పెరిగింది. విద్యుత్ వినియోగం పెరుగుతుండటంతో డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం, అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నిరంతర విద్యుత్ సరఫరా అదించాలనేది ప్రభుత్వ ఆలోచన. వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాలకు, వివిధ రంగాలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం వేసవిలో సమగ్ర ప్రణాళికతో అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఎండల తీవ్రత పెరగడంతో కూలర్లు, ఏసీలు, ఫ్యాన్ల వాడకం పెరిగింది. అదేవిధంగా 24 గంటల విద్యుత్ కారణంగా వ్యవసాయ రంగానికి ఆటోమెటిక్ స్టార్టర్లు ఉపయోగించడంతో విద్యుత్ వినియోగం పెరిగింది.

ఉత్కంఠ భరితంగా ఎమ్మెల్సీ పోరు..!

(5వ పేజీ తరువాయి)

కలుస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. గతంలో ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానాన్ని మళ్లీ నిలబెట్టుకోవాలనే సంకల్పంతో పీఆర్‌టీయూ సైతం గట్టిగా పనిచేస్తోంది. సంఘం అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం సాగిస్తుండగా, పీఆర్‌టీయూ నాయకులు ఎక్కడికక్కడ ఉపాధ్యాయులను కలిసి మద్దతు కోరుతున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్సీ పూలరవీందర్ బలంగా ప్రచారం సాగిస్తున్నారు. బీసీ నినాదంతో పాటు, తాను ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహించిన సమయంలో సాధించిన విజయాలను ఆయన ప్రస్తావిస్తున్నారు. బీసీ సంఘాలన్నీ ఆయనకు మద్దతు ప్రకటించడంతో పోటీపై ఉపాధ్యాయుల్లో ఆసక్తి కొనసాగుతోంది. మరో స్వతంత్ర అభ్యర్థి సుందర్‌రాజ్ యాదవ్ సైతం క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులను కలుస్తూ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అధికారికంగా పార్టీ తరుపున అభ్యర్థిని బరిలో నిలిపిన బీజేపీ భిన్న తరహాలో ప్రచారం సాగిస్తోంది. తమ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి విజయం కోసం కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటెల రాజేందర్, ఇతర ముఖ్యనేతలంతా ఉధృతంగా ప్రచారం సాగిస్తున్నారు. సంఘాలకతీతంగా ఉపాధ్యాయులందరినీ కలిసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. పార్టీలో అందుకోసం ప్రత్యేకంగా టీమ్‌వర్క్‌ను కొనసాగిస్తున్నారు. చిన్న బృందాలుగా ఉపాధ్యాయ సమావేశాలు నిర్వహించి ఆ సమావేశాలకు పార్టీ తరపున ప్రతినిధులు హాజరవుతున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలోని పార్టీ అన్ని జిల్లాల పదాధికారులు, రాష్ట్ర, జాతీయ కార్యవర్గసభ్యులు, కీలక నేతలంతా ప్రచారబాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మొత్తంగా కీలకమైన అభ్యర్థులంతా గెలుపు కోసం ప్రత్యేక వ్యూహాలను తెరమీదకు తెస్తుండడం, ప్రచారం ఉధృతమవడంతో గెలుపోటములపై ఉపాధ్యాయ ఓటర్లలోనూ విస్తృతస్థాయిలో చర్చ కొనసాగుతోంది. రానున్న ఐదు రోజుల్లో ప్రచారం పతాకస్థాయికి చేరనుండడంతో సమీకరణలు ఏవైపు దారితీస్తాయనే అంశంపై సర్వత్రా ఆసక్తి ఉంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

సూర్యాపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమా దాల్లో ఇద్దరు మృతి చెందగా, ఒకరు గాయపడ్డారు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం నవరంగపూర్ జిల్లా జరుగూడ గ్రామానికి చెందిన అల్తార్(24) నల్గొండ జిల్లా నకిరేకల్‌లోని ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. అయితే నలుగురు మిత్రులతో కలిసి గురువారం ఉదయం సూర్యాపేటకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో జనగాం క్రాస్ రోడ్డులో రన్నింగ్ బస్సు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి బస్సు వెనక టైర్ కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, 8నెలల కుమారుడు ఉన్నారు. అల్తార్ మిత్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

● బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం కాసరబాద గ్రామానికి చెందిన వగ్గు సుధీర్(21), వగ్గు సంపత్‌లు కలిసి దురాజ్‌పల్లి జాతరకు బైక్‌పై వెళ్లి వస్తుండగా కేసారం గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి వాగులోకి దూసుకువెళ్లింది. వాగులో ఉన్న బండరాళ్లు తలకు బలంగా తాకడంతో బైక్ నడుపుతున్న సుధీర్ అక్కడిక్కడే మృతి చెందాడు. వెనక ఉన్న సంపత్‌కు తీవ్ర గాయాలు కావడంతో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆ పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేదు

● *కేంద్ర పర్యాటక శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి*

యాదాద్రి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేదని, అందుకే తెర వెనుక నాటకాలు ఆడుతున్నాయని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మార్పు ఏమీ లేదని, బీఆర్‌ఎస్ స్థానంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోపిడీకి పాల్పడుతున్నారని, గత సీఎం మాదిరిగానే ప్రస్తుత సీఎం తిడుతున్నారని విమర్శించారు. ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి విస్మరించారని, రాష్ట్రంలో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లో ఉద్యోగాల కోసం యువత చదువుకుంటున్నారని, ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ అక్కడికి వెళ్లి వారికి అనేక హామీలు ఇచ్చారని, రెండులక్షల ఉద్యోగాలు భర్తీ హామీ ఏమైందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా, మూడు డీఏలు, కాంగ్రెస్ వచ్చాక రెండు డీఏలు ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులంతా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. భూపాలపల్లిలో రాజలింగమూర్తి దారుణహత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, హత్యా రాజకీయాలను ఉక్కుపాదంతో అణచివేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలి

● *మాండ్య విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.శివ చితప్ప*

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి లక్ష్యాన్ని కలిగి తనలా ఉన్నత స్థానానికి రావాలని కర్ణాటకలోని మాండ్య విశ్వవిద్యాలయ వీసీ కే.శివ చితప్ప అన్నారు. నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగంలో గత రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుగ్రామం నుంచి జీవితం కొనసాగించి ఒక విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్ అయ్యానని తెలిపారు. కొల్హాపూర్ శివాజీ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం మాజీ ప్రొఫెసర్ కాంబ్లీ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక గణాంకాలను విద్యార్థులకు వివరిస్తూ ఆర్థిక ఫలాలు మానవ అభివృద్ధికి దోహదపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ అంజిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి ప్రజలందరితో సమ్మిళితమై ఉండాలన్నారు. నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ జాతీయ సదస్సులతో విద్యార్థుల్లో పరిశోధన దృక్పథం పెరుగుతుందన్నారు. జాతీయ సెమినార్‌కు దేశం నలుమూలల నుంచి విద్యార్థులు, ఆచార్యులు హాజరై ప్రజెంటేషన్ చేసి అభివృద్ధిపై వారి అభిప్రాయాలు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో జరిగిన టెక్నికల్ సెషన్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, టెక్నాలజీ, గ్రీన్ టెక్నాలజీ అభివృద్ధిపై చూపే ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ డాక్టర్ డి.మునిస్వామి, డాక్టర్ మల్లేశం, సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ భట్టు కిరీ టం, వెల్దండి శ్రీధర్, నర్సింగు కోటయ్య, జ్యోత్స్న, బొజ్జ అనిల్, అనిల్‌అబ్రహం, ఎం.సుధాకర్, జాజుల దినేష్, నాగరాజు, హస్రత్, అంకుస్, కవిత, శిరీష, శివరాణి, సావిత్రి, శంకరయ్య, నాగరాజు, పుణ్యవతి, రీసెర్చ్ స్కాలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతన్న శివ చితప్ప

రాష్ట్రస్థాయి పోటీలకు నిహారిక



పెద్దవూర, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గుండాల నిహారిక ఈ నెల 9న నాగార్జున సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ టీం విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మురళీ గురువారం తెలిపారు. ఈనెల 20 నుంచి 23తేదీల్లో వికారాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో నిహారిక నల్లగొండ జిల్లా జట్టు తరపున తలపడనుందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నిహారికను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ అభినందించారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్‌లో వెండి పతకం

నాగార్జునసాగర్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఒలంపిక్స్‌లో నేషనల్ నెట్‌బాల్ పోటీల్లో సాగర్ హిల్‌కాలనీ సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వెండి పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం లలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 16వ తేది వరకు ఉత్తరఖాండ్‌లో నిర్వహించిన 38వ ఇండియన్ నేషనల్ గేమ్స్ ఒలంపిక్స్‌లో పాల్గొన్న జె.సుప్లవిరాజ్, ఎస్‌కే.రిజ్వానాలు రాష్ట్రం తరపున ఆడి సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మెడల్ సాధించిన విద్యార్థులను నల్లగొండ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్, హెచ్‌ఎం లలిత, సిస్టర్ మతీనా, కిరణ్‌కుమార్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

వాహన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలి

మర్రిగూడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు వాహనాలకు సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని నల్లగొండ ఎంవీఐ చంద్రశేఖర్ సూచించారు. స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. 14 వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ బుక్‌లు లేకపోవడం వల్ల వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సిలిండర్లను ఇళ్ల వద్దకే చేరవేయాలి

మర్రిగూడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీ వారు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరవేయాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ అన్నారు. తమ్మడపల్లి గ్రామ సమీపంలో గ్యాస్‌ను తరలిస్తుండగా వాటిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు నిర్వాహకులు కొన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ డోర్ డెలివరీని చేయడం లేదన్నారు.

పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడిగా రమేశ్



నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీ సంఘం నార్కట్‌పల్లి మండలాధ్యక్షుడిగా మండలంలోని ఏపీలింగోటం గ్రామానికి చెందిన గంజి రమేశ్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ఎల్లారెడ్డిగూడెంలో గురువారం నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ పద్మశాలీలు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా శాఖ ఇచ్చే ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘంలోని ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



పెద్దకాపర్తిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి అన్నారు. మండలం పెద్దకాపర్తిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆనమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు ఇచ్చే ఆహారపదార్థాలు, రికార్డులను, ఆరోగ్య లక్ష్మి పదార్థాలను పరిశీలించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. అంతేకాకుండా స్థానికంగా ఇచ్చే ఆహారాన్ని నాణ్యమైనదిగా ఆరోగ్యకరమైనవిగా ఉండాలన్నారు. పీడీ వెంట మునుగోడు సీడీపీఓ లావణ్య, ఏసీడీపీఓ వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సుజాత, గీత, మమత, సత్యవతి ఉన్నారు.

పరిసరాల స్వచ్ఛతపై అవగాహన కల్పించాలి



ర్యాలీలో పాల్గొన్న ఎఫ్‌సీఐ మేనేజర్ ప్రసాద్, అధికారులు, సిబ్బంది

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల స్వచ్ఛతపై అవగాహన కల్పించే ప్రయత్నంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని భారత ఆహార సంస్థ జిల్లా సీనియర్ మేనేజర్ కే ఎస్ కే ప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ ద్వారా పని ప్రదేశాలు ఇతర బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే కాక, ఇతర పరిసరాల శుభ్రత, స్వచ్ఛత గణనీయంగా మెరుగుపడిందని ఆయన అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా నల్లగొండలోని గోదాము నుంచి కలెక్టరేట్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు స్వచ్ఛ భారత్ నినాదాలతో కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి స్థానికుల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ అధికారులు బిల్లా శ్రీనివాస రావు, సతీశ, పవన్, కుసుమ, కాసిరెడ్డి, సుకుమార్, ఆదిమల్ల శంకర్, రాము, నిర్వాహకులు సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలిగా ఈశ్వరమ్మ



నియామక పత్రం అందుకుంటున్న ఈశ్వరమ్మ

కట్టంగూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలిగా మండలకేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన మేడి ఈశ్వరమ్మ రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ గాంధీ భవన్ జరిగిన కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు నియామకపత్రం అందజేశారు. ఈశ్వరమ్మ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే వేముల వీరేశానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్సూరెన్స్‌లో విదేశీ పెట్టుబడులను ఆపాలి



విరామ సమయంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగుల

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ పెట్టుబడులను ఆపాలని ఎల్‌ఐసీ ఐసీఈయూ నల్లగొండ బ్రాంచి-2 ప్రెసిడెంట్ పోలె లింగయ్య డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లగొండలోని బ్రాంచ్ 2 ఆవరణలో ఐసీఈయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగంలో క్లాస్ 3, క్లాస్ 4లో రిక్రూట్‌మెంట్ చేయాలని, విదేశీ పెట్టుబడులను ఆపాలన్నారు. అదే విధంగా 1996 బ్యాచ్ ఉద్యోగులకు పెన్షన్ ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సెక్రటరీ వేముల శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ కర్నాకర్‌రావు, రమేష్, ట్రెజరర్ సత్యనారాయణ, ఈసీ మెంబర్లు యాదగిరి, రామయ్య, శ్రీకాంత్, నరసింహ, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

'పది' టాపర్‌కు ప్రోత్సాహకం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గతేడాది పదో తరగతి వార్షిక పరీక్షల్లో పాఠశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థి ఎస్.సాయికృష్ణకు క్యూట్ రూట్ ఫౌండేషన్ సంస్థ రూ.10 వేలు ప్రోత్సాహకాన్ని గురువారం అందజేసినట్లు ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హిమజ తెలిపారు. గతేడాది విద్యా సంవత్సరంలో 9.2 జీపీఏ సాధించిన సాయికృష్ణకు గురువారం ఏపీ రాష్ట్రం పిడుగురాళ్లలో జరిగిన కార్యక్రమంలో చెక్‌ను అందజేసినట్లు ఆమె తెలిపారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌లు, బ్యాగుల పంపిణీ

శాలిగౌరారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6వ తరగతి విద్యార్థులు టై, బెల్ట్‌లు అందజేశారు. 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్‌లో సెలక్ట్ అయిన వారికి స్కూల్ బ్యాగ్‌లు ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, సంధ్యారాణి, చిత్తలూరి సత్యనారనాయణ, కేతేపల్లి శ్రీను, దామెర్ల కృష్ణయ్య, సంపత్ కుమార్, కుక్కడపు శ్రీనివాస్, సృజన, శ్వేత, అనురాధ, సంగీత, సంధ్య, శ్రీరాములు, మల్లేష్, తండు అంజనేయులు, రవి, యూనుస్, సహన, జేబున్నీస, సరస్వతి, రాధ, వేణు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 10లోగా సీఎంఆర్‌ను చెల్లించాలి



మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మార్చి 10లోగా సీఎంఆర్‌ను బకాయిలు చెల్లించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. గురువారం రైస్ మిల్లుల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 రబీకి సంబంధించి కొందరు రైస్ మిల్లర్లు 9వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను చెల్లించాల్సి ఉందన్నారు. రైస్ మిల్లర్లు నిరేశించిన సమయంలో సీఎంఆర్ చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ మిల్లర్ల సంఘం ఇదివరకే ఇచ్చిన హామీ మేరకు బ్యాంకు గ్యారంటీని వెంటనే సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, మేనేజర్ హరీష్, డీసీవో పత్యానాయక్, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నాంపల్లి : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

నాంపల్లి, ఫిబ్రవరి 20, (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రూ. 21వేల కోట్ల రుణ మాఫీ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. జిల్లాలో 2.46లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసి రైతులకు అండగా ఉంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మూడు ఎకరాల వరకు రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాలో జమ చేసిందని మిగతా రైతులకు కూడా త్వరలో రైతుబంధు అందజేస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నిష్పక్ష పాతంగా ప్రభుత్వం కులగణనను నిర్వహిస్తుందని దానిపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తప్పుడు ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జనాభాను లెక్కించడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని కులగణను చేపట్టిందన్నారు. 14 నెలలుగా ప్రజా క్షేత్రంలోనికి రాని కేసీఆర్ కాంగ్రెస్ పని అయిపోయిందని అనడం హాస్యస్పందంగా ఉందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, పానుగంటి వెంకటయ్య, దామెర మాజీ సర్పంచ్ దామెర యాదగిరి, రమావత్ రవినాయక్, అన్నెపాక కిరణ్, అన్నెపాక హరీష్, రాజు, వెంకన్న పాల్గొన్నారు.

గిరిజనులను ఏకం చేసిన ఘనత సేవాలాల్‌దే



సేవాలాల్ జయంతిలో పాల్గొన్న తహసీల్దార్లు, పలు పార్టీలకు చెందిన గిరిజన నాయకులు

నాంపల్లి, ఫిబ్రవరి 20, (ఆంధ్ర జ్యోతి): గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి మండల కేంద్రంలో గురువారం ప్రభుత్వం ఓ ప్రైవేటు పంక్షన్‌లో గురువారం నిర్వహించారు. గిరిజనులు మహరాజ్ వేష ధారణతో డీజే చప్పుళ్లతో భారీగా ర్యాలీ నిర్వహించి ముందుగా సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా అధి కారులు, నాయకులు మాట్లాడుతూ గిరిజన జాతులను ఏకతాటిపై తీసుకొచ్చి నేడు సమాజంలో రాజకీయంగా నిలబడ్డామంటే దానికి కారణం ఆనాడు సంత్ సేవాలాల్ మహరాజ్ చేసిన కృషి ఎంతో ఉంద న్నారు. ప్రభుత్వం గుర్తించిసేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడం గర్వంగా ఉందన్నారు .కార్యక్రమంలో తహసీల్దార్లు దేవసింగ్, దశరథ, కృష్ణ, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాములు, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, ట్రైకార్ మాజీ చైర్మన్ రామచందర్ నాయక్, మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, రెడ్ల రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఛాయా సోమేశ్వరాలయంలో పడిపూజ



పడి పూజ మహోత్సవంలో పాల్గొన్న శివ మాలధారులు

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ఉన్న పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో శివస్వాములు గురువారం పడి పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో శివమాలాధారులు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ నామస్మరణతో ఆలయమంతా మారుమోగింది. ఆలయంలో గణపతి పూజ, రుద్రహోమం, పడిపూజ, రేణుక ఎల్లమ్మ బోనాలు అత్యంత భక్తి పారవశ్యంతో ఆలయ అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో చెర్వుగట్టు శ్రీనుస్వామి, మధుస్వామి, వెంకన్నస్వామి, శ్రీనుస్వామి, కృష్ణస్వామి తదితరులు ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం



టీఎల్ మెటీరియల్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిట్యాల, ఫిబ్రవరి 20,(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎంఈవో పోనుగోతు సైదానాయక్ కోరారు. ఇక్కా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిట్యాల భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు గురువారం టీచింగ్, లెర్నింగ్ మెటీరీయల్, హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్, ఇక్కా ఫౌండేషన్ ప్రతినిధులు అఖిల్ రెడ్డి, భరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన బోయపర్తి లచ్చయ్య కుమార్తె వివాహానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వట్టికోటి శేఖర్ రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోయపర్తి లింగయ్య, జాల జంగయ్య, బోయపర్తి గణేష్, ఒగ్గు సైదులు, బోయపర్తి సంజీవ, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా



మర్రిగూడ మండలం వట్టిపల్లి గ్రామ శివారు లోని బట్లపల్లికి పోయే దారిలో మిషన్ భగీరథ పైపు లీకేజీ అయి నీరు వృథాగా పోతుంది. రెండు నెలల నుంచి లీకేజీ అయి స్థలంలో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో నీటి నిల్వతో దోమలకు నిలయంగా మారింది. లీకేజీ అయిన పైపులైన్‌కు మరమ్మతు చేపట్టి నీరు అదేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక కోరుతున్నారు.
(ఆంధ్రజ్యోతి-మర్రిగూడ)

దళితులకు ద్రోహం చేస్తున్న ప్రభుత్వం



ఎమ్మెల్సీ కవితను కలిసిన దళితబంధు లబ్ధిదారులు

నల్లగొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దళితబంధు పథకానికి ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా దళితులకు ద్రోహం చేస్తోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో దళితబంధు లబ్ధిదారులు హైదరాబాద్‌లో గురువారం ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు లబ్ధిదారులందరికీ ప్రొసిడింగ్స్ ఇచ్చామని, వారి ఖాతాలు కూడా తెరిచినట్లు తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులు కూడా విడుదల చేశారని, ప్రస్తుతం లబ్ధిదారులపై కక్షకట్టి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన కమిటీ కన్వీనర్ కందుల లక్ష్మయ్య, శంకర్, లింగయ్య, రేణుక, రవి, రాంబాబు, యాదయ్య, నాగయ్య, ఏడుకొండల్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

గట్టుప్పల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలం గాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నా రు. మండలకేంద్రంలో గురువారం జరిగిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు రాయితీ ఇస్తూ పూర్తిగా దేశంలోని సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ వర్గాలకు అప్పజెబుతోందన్నారు. పేదలపై భారాలు మోపుతూ దేశంలో మౌలిక సమస్యలను, పేదరికం, నిరుద్యోగం అరికట్టడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇవ్వకపోవడం, రైల్వే నూతన లైన్ ఏర్పాటులో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామీణ స్థాయిలో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాపోలు ధనంజయ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్. రామలింగయ్య, టి.వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి బీమనపల్లి రమేష్, సహాయ కార్యదర్శి రాపోలు సత్తయ్య, నాయకులు ముత్యాలు, యాదయ్య, ధర్మయ్య, లక్ష్మయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వైద్యం అందడం లేదు



పశు ఆరోగ్య ఉప కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పశువులు, జీవాలకు వైద్యం అందించడంలో పశువైద్యుడు నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపిస్తూ మండలంలోని పెద్దకాపర్తి పశు ఆరోగ్య ఉప కేంద్రం ఎదుట పాడిరైతులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులు, జీవాలకు వైద్యం చేయించాలంటే స్థానిక పశు వైద్యుడు ఆరు నెలలుగా రావడం లేదని ఆరోపించారు. స్థానికంగా ఉండాల్సిన వైద్యుడు విధులకు హాజరుకావడం లేదని, ఉపకేంద్రం ఎప్పుడూ తాళం వేసి ఉంటుందన్నారు. పశువులు, జీవాలకు అనారోగ్య సమస్యలు వస్తే ప్రైవేట్ వైద్యుడిని సంప్రదించాల్సి వస్తోందన్నారు. పశుఆరోగ్య ఉపకేంద్రానికి వైద్యుడిని కేటాయించి పశువులకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు గుండెపురి లింగస్వామి బడె వసంత్‌కుమార్, మర్రి శేఖర్‌రెడ్డి, ఈరటి మల్లయ్య, తోటకూరి ఎల్లయ్య, తెల్సూరి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

టీచర్లుగా మారి.. తోటి విద్యార్థులకు బోధించి




వడ్డేపల్లిలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నాంపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. టీచర్లుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయురాలిగా అమూల్య, మండల విద్యాధికారిగా వికాస్, మండల పరిషత్ అధికారిగా రిషిత, జిల్లా విద్యాధికారిగా విఘ్నేష్, కలెక్టర్‌గా ఉరిపక్క చైత్ర వ్యవహరించారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే వీరేశం పరామర్శ

కేతేపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం పరామర్శించారు. కేతేపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అయితగోని వెంకట్‌గౌడ్ తండ్రి రిటైర్డ్ ఉద్యోగి యల్లయ్యగౌడ్ అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతిచెందారు. మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన కొమ్ము ప్రమోద్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్ద చికిత్సపొందుతున్నాడు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యకమంలో మార్కెట్ డైరెక్టర్ బయ్య ముత్తయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె. శ్రీనివాసయాదవ్, నాయకులు గుత్తా మాధవరెడ్డి, ఎ. వీరాచారి, ఎ. మహేందర్‌రెడ్డి, ఎన్. మంగమ్మ, మున్న అశోక్, కొమ్ము వెంకన్న, చింత ఆంధ్రయ్య తదితరులు ఉన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.0 । కనిష్ఠం 19.2

● హవనాలు, జపాలు



యాదగిరీశుడి స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాల సందర్భంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు ●7లో..

'థార్' గ్యాంగ్ సూత్రధారి అరెస్టు

- మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అష్రఫ్‌ఖాన్
- సెటిల్‌మెంట్లే తప్ప కేసులు, అరెస్టులు తక్కువే
- నార్కట్‌పల్లి ట్రావెల్స్ బస్సులో రూ.25లక్షల నగదు తస్కరించింది ఈ ముఠానే
- పరారీలో ముగ్గురు ముఠా సభ్యులు

●6లో..

● లింగన్నా.. మళ్లొస్తాం



సూర్యాపేట జిల్లా పెద్దగట్టు జాతర ముగియడంతో చివరి రోజూ భక్తులు స్వామివారిని దర్శించుకొని ఇంటికి తిరుగుపయనమయ్యారు. ●6లో..

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోరు ఉత్కంఠభరితంగా సాగుతోంది. ప్రధాన అభ్యర్థుల ప్రచారం, వ్యూహరచన పోటాపోటీగా సాగుతోంది. ఈనెల 25 సాయంత్రానికి ప్రచార గడువు ముగియనుండడంతో ఈలోగా వీలైనంత మేర ప్రతీ ఉపాధ్యాయుడికి తమ పోటీ ఉద్దేశం, గెలుపు ఆవశ్యకత సందేశమందేలా అభ్యర్థులు, వారి తరపున సంఘాలు పనిచేస్తున్నాయి. బీజేపీ మాత్రమే అధికారికంగా పార్టీ అభ్యర్థిని నిలబెట్టడమేగాక ఆ పార్టీ కీలకనేతలంతా ప్రచారం నిర్వహిస్తున్నారు. అధికార కాంగ్రెస్ ఇప్పటివరకు మద్దతు ఎవరికనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఈ ఎన్నికలకు దూరంగా ఉంటామని ప్రకటించింది. బీజేపీ మినహా మిగిలిన పార్టీలు ఈ ఎన్నిక విషయంలో తటస్థంగా ఉండగా, ఉపాధ్యాయ సంఘాలు మాత్రం పోటాపోటీగా బలపరచిన అభ్యర్థుల కోసం పనిచేస్తున్నాయి. సమావేశాలు, సమ్మేళనాలు, సోషల్ మీడియా ప్రచారాలు, వాట్సప్‌లలో సందేశాలు, కరపత్రాలు, హామీ ప్రకటనలతో ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



ఉత్కంఠ భరితంగా ఎమ్మెల్సీ పోరు

- ఉధృతంగా ప్రచారం సాగిస్తోన్న అభ్యర్థులు
- అభ్యర్థుల గెలుపుకోసం సంఘాల కృషి
- తమ పార్టీ అభ్యర్థిని గెలిపించడానికి రంగంలోకి దిగిన బీజేపీ
- వ్యూహప్రతివ్యూహాలు అమలుచేస్తోన్న ప్రధాన అభ్యర్థులు

ఉపాధ్యాయ నియోజకవర్గంలో క్షేత్రస్థాయి ప్రచారం ఉధృతంగా సాగుతోంది. ప్రతీ ఉపాధ్యాయుడికి సందేశం అందేలా అభ్యర్థులు,వారికి మద్దతిస్తున్న సంఘాలు ప్రచారం సాగిస్తున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి స్థానాన్ని నిలబెట్టుకోవడానికి టీఎస్‌యూటీఎఫ్ తీవ్రంగా శ్రమిస్తోంది. నర్సిరెడ్డి తరఫున సంఘం మండల శాఖలు మొదలు జిల్లా శాఖల బాధ్యులతో పాటు సంఘ సభ్యులందరూ ప్రతీ ఉపాధ్యాయుడిని కలిసి ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. ఆరేళ్లలో ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు, ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై, ప్రభుత్వ విద్య పరిరక్షణకు నర్సిరెడ్డి చేసిన కృషిని, పోరాటాన్ని వివరిస్తున్నారు. ఓ వైపు అభ్యర్థి నర్సిరెడ్డి ఉధృతంగా సమావేశాల్లో పాల్గొంటూ ప్రచారం చేస్తుండగా, మరోవైపున యూటీఎఫ్ సభ్యులు రాజకీయాలు, సంఘాలకతీతంగా ఉపాధ్యాయుల కోసం పనిచేసే నర్సిరెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న పీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నియోజకవర్గమంతా సమావేశాలు, సమ్మేళనాల్లో పాల్గొంటున్నారు. ఆయన పాల్గొనే కార్యక్రమాలతో పాటు ఆయన తరఫున టీపీఆర్‌టీయూ నాయకులు, ఆయనకు మద్దతు ఇస్తున్న ఇతర సంఘాల నాయకులు ఎక్కడికక్కడ ఉపాధ్యాయులను...

- మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో గత ఏడాదికి భిన్నంగా ఫిబ్రవరి మాసంలోనే విద్యుత్‌కు భారీ డిమాండ్ పెరిగింది. ఒక్క నల్లగొండ జిల్లాలో ఈ నెలలో 1,002 మెగావాట్ల డిమాండ్‌కు విద్యుత్ చేరింది. ఇది ఆల్‌టైమ్ రికార్డ్ కాగా, ఈ డిమాండ్ ఈనెల 17న నమోదైంది. గత ఏడాది ఫిబ్రవరి 23 నాటికి 966 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ/నల్లగొండ టౌన్)



నల్లగొండ హెట్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ ముషారఫ్ ఫరూఖ్

విద్యుత్ డిమాండ్ @ 1,002 మెగావాట్లు



- ఇది ఆల్‌టైమ్ రికార్డు
- గత ఏడాది ఇదే నెలలో 966 మెగావాట్లు

ఉమ్మడి జిల్లాలో విద్యుత్ డిమాండ్ పెరగడంతో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖ్ గురువారం నల్లగొండలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి వేసవి కార్యాచరణ ప్రణాళికను సమీక్షించారు. గత ఏడాది ఓవర్‌లోడ్‌తో 67 పీటీఆర్ (పవర్‌ట్రాన్స్‌ఫార్మర్) సమస్యలు ఎదుర్కోగా, ప్రస్తుతం విద్యుత్‌శాఖ తీసుకున్న చర్యలతో ఎలాంటి ఓవర్‌లోడ్ లేకుండా చూస్తున్నారు. దీంతో విద్యుత్ కోతలు లేకుండా ప్రస్తుతం ఎలాంటి సమస్య లేకుండా సరఫరా అవుతోంది. ఇప్పటి వరకు హైదరాబాద్‌కే పరిమితమైన 1912 విద్యుత్ కాల్ సెంటర్‌ను జిల్లాల కూడా విస్తరిస్తున్నారు. విద్యుత్ అంతరాయాలు సమయంలో వెంటనే పరిష్కరించేందుకు అంబులెన్స్ తరహాలో ఈఆర్‌టీ (ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం)ను ఏర్పాటు చేయనున్నారు. వేసవి కార్యాచరణలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల తనిఖీకి సబ్‌స్టేషన్లను సందర్శిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

వేసవి ప్రణాళిక రూపొందించాం

- వెంకటేశ్వర్లు, ఎస్ఈ, నల్లగొండ

రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా వేసవి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. అంతేగాక అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడా విద్యుత్‌కు అంతరాయం తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. అదేవిధంగా ఈ ఏడాది మొత్తం 10 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఇప్పటికి నాలుగు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చాం.

8.24లక్షలకు పైగా వినియోగదారులు

నల్లగొండ జిల్లాలో మొత్తం 7,66,107మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. అందులో వ్యవసాయ వినియోగదారులు 2,37,660మంది, గృహ విద్యుత్ వినియోగదారులు 4,65,530 మంది, వాణిజ్య వినియోగదారులు 63,977మంది, పరిశ్రమలు 6,485 ఉన్నాయి. వీధి దీపాలు 8,372, వాటర్ వర్క్స్ కనెక్షన్లు 2,710, ఇతర వినియోగదారులు 1,373మంది ఉన్నారు. కొత్తగా మరో 20వేల మంది వినియోగదారులు చేరారు. జిల్లాలో గృహ, వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయరంగాలకు విద్యుత్ వినియోగం పెరిగింది. గృహజ్యోతి పథకం కింద జిల్లాలో 2.37లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. అదేవిధంగా ఈ ఏడాది 5,600 వ్యవసాయ కనెక్షన్లు నూతనంగా మంజూరయ్యాయి. గత సంవత్సరం 67 సబ్‌స్టేషన్ల పరిధిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఓవర్‌లోడ్ అయ్యాయి. డివిజన్ల వారీగా పెరుగుతున్న...

- మిగతా 7వ పేజీలో...

ఇసుక రవాణాపై నిఘా పెంచాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పాల్గొన్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, తదితరులు

నల్లగొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా నిఘా, తనిఖీలను పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఇసుక రీచ్‌ల నుంచి అనుమతి లేని వాహనాల్లో ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రీచ్‌ల వద్ద నైట్ విజన్ కెమెరాలతో పాటు, హైరిజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద డ్రోన్ సర్వే చేయిస్తామన్నారు. పరిమితికి మించి ఇసుక తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా గుర్తించిన ఇసుక రీచ్‌లను ఎంపీడీవోలు, తహసీల్దార్లు సంయుక్తంగా సందర్శించి వారంలోగా నివేదిక ఇవ్వాలన్నారు. దేవరకొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీన్ని అధికారులు సమన్వయంతో అడ్డుకోవాలన్నారు. జిల్లాలో 24 రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లను 31 గ్రామాల్లో నిర్మిస్తున్నారని, వాటికి మాత్రమే ఇసుకను మంజూరు చేయాలన్నారు. రీచ్‌ల వద్ద సాయంత్రం 5గంటల వరకు మాత్రమే ఇసుకను తవ్వేందుకు అనుమతి ఉందన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నాలుగు నెలల క్రితమే జాయింట్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, దేవరకొండ ఏసీపీ మౌనిక, మైనింగ్‌శాఖ సహాయ సంచాలకుడు జాకబ్, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

150 రోజులను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక

వేసవిలో తాగునీటికి సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎక్కడైనా తాగునీటి పైపులు, నల్లాలు, అత్యవసర మరమ్మతులు ఉంటే పంచాయతీ నిధుల నుంచి చేయించాలని ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రైవేట్ వ్యవసాయ బోర్లకు అనుమతి ఇస్తామన్నారు. రానున్న 150 రోజులను దృష్టిలో ఉంచుకొని సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ, మిషన్ భగీరథ గ్రిడ్‌లో సమస్యలు లేవని, అంతర్గత సరఫరాలో సమస్యలను గుర్తించామన్నారు. ఎక్కడైనా చేతి పంపులు, తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతులు ఉంటే వాటిని పూర్తిచేయాలన్నారు. మిషన్ భగీరథ ఈఈ వంశీ కృష్ణ మాట్లాడుతూ, వేసవి ప్రణాళికలో భాగంగా ప్లాన్ ఏ, బీ, సీ కార్యక్రమాలను వివరించారు.

పంటల మార్పిడితో ప్రయోజనం

(ఆంధ్రజ్యోతి, త్రిపురారం): పంటల మార్పిడితో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల పరిధిలోని కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో పత్తి అధిక సాంద్రత సాగు విధానంపై గురువారం ఒక్క రోజు నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆమె మాట్లాడారు. హైబ్రిడ్ వంగడాల సాగు, వ్యవసాయ అనుబంధ రంగాలపై రైతులు దృష్టి సారించాలన్నారు. అనంతరం కేవీకేలో వివిధ రకాల పంటల సాగును కలెక్టర్ పరిశీలించారు. అధిక సాంద్రత పత్తి సాగుపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేడీఏ శ్రవణ్‌కుమార్, శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రావు, లింగయ్య, చంద్రశేఖర్, రాములమ్మ, శ్రీధర్, మండల వ్యవసాయాధికారి పార్వతిచౌహన్, పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆ సమయంలో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో ఆమె గురించి నైట్‌వాచ్‌మెన్‌ను ఆరా తీశారు. హాస్టల్‌లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లల విద్యా సామర్థ్యాలను పరిశీలించి వారికి చాక్‌లెట్లు అందజేశారు.

విద్యుత్ సమస్య లేకుండా చర్యలు

సీఎండీ ముషారఫ్ ఫరూఖ్

వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్య లేదన్నారు. వారం రోజుల నుంచి లోడ్ పెరుగుతోందని, గత ఏడాది ఫిబ్రవరి చివరి నాటి కంటే ఈసారి 1,002మెగావాట్ల అధిక వినియోగం జరిగిందన్నారు. ఏదైనా సమస్యలు వస్తే కలెక్టర్‌తో పాటు తన దృష్టికి తీసుకువస్తే సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లాలో అధునాతన సౌకర్యాలతో మోడల్ సబ్‌స్టేషన్ నిర్మించాలన్నారు. ప్రతీ సబ్‌స్టేషన్ డివిజన్ క్విక్ రెస్పాన్స్ వాహనం మంజూరు చేస్తున్నామని, జిల్లాకు తొమ్మిది వాహనాలు మంజూరు చేశామన్నారు. మార్చి 15లోగా ఇవి అందుబాటులోకి వస్తాయన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మోడల్ సబ్‌స్టేషన్‌కు స్థలాలు చూస్తామని, ఆటోచేంజ్ ఓవర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, విద్యుత్‌శాఖ డైరెక్టర్ నర్సింహ, సీఈలు భిక్షపతి, బాలకృష్ణ, ఎస్ఈ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులందరికీ న్యాయం చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గుడితండా వాసులు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పెండ్లిపాకల రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న గుడితండాలో అర్హులకు న్యాయం చేయాలని పునర్నిర్మాణ సమగ్ర అభివృద్ధి సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పెండ్లిపాకల రిజర్వాయర్‌లో గ్రామం పూర్తిగా ముంపునకు గురవుతున్నందున గతంలో అధికారులు సర్వే నిర్వహించి అవార్డు ప్రకటించారని తెలిపారు. అందులో పలు అవకతవకలు జరగ్గా, గ్రామకమిటీ తరఫున వినతిపత్రం అందజేయగా, రీసర్వే నిర్వహించారన్నారు. అయితే రీసర్వే పూర్తవకుండానే ఈనెల 17న అవార్డు ప్రకటించగా, అందులో అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. తక్షణమే పూర్తిస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్.సుభాష్‌చంద్రబోస్, మాత్యనాయక్, హనుమ, బాలునాయక్, సక్కునాయక్, వెంకట్, రాంచంద్రనాయక్, పాల్గొన్నారు.

మృతదేహంతో స్టేషన్ ఎదుట

ఆందోళన

- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్
- ఈ నెల 2న రోడ్డు ప్రమాదం.. చికిత్స పొందుతూ మృతి

●6లో..

కష్టపడి చదివి

ఉన్నత స్థానాలకు చేరాలి

- మాండ్య విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.శివ చితప్ప

●6లో..

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం



మహాసభల్లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల రెండో రోజు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో ఎంజీ యూనివర్సిటీకి రూ.1,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీలకు వీసీలను నియమించినా, అభివృద్ధికి మాత్రం నిధులు కేటాయించలేదన్నారు. యూనివర్సిటీల్లో నిధులు లేక కొన్ని కోర్సులు ఎత్తివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగానే మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెరిగాయన్నారు. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులను బోర్డు, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు పదో తరగతి టాలెంట్ టెస్ట్‌లు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోడల్ ఎంసెట్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పలు అంశాలపై సెమినార్లు, అవగాహన సదస్సులు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. మహాసభల్లో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, నాయకులు శ్రీకాంత్, ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, మారుపాక కిరణ్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా షేక్ జాను



మిర్యాలగూడ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా షేక్ జాను నియామకమయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ అఖిల భారత మహిళా విభాగం అధ్యక్షురాలు అల్కా లంబా జారీ చేసిన నియామకపత్రాన్ని గురువారం గాంధీభవన్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అందజేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

చింతపల్లి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మేడ్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు బుధవారం పీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చల్లం పాండు రంగారావుస్టడీ మెటీ రియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండలో ఇప్పటి వరకు 3000 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించామని ఆయన తెలిపారు. అనంత రెడ్డి, సభ్యులు కోటయ్య పాల్గొన్నారు.

అంతర్గత మార్కుల నమోదు పరిశీలన



అంతర్గత మార్కుల రికార్డులను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

త్రిపురారం ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థుల అంతర్గత (ఇంటర్నల్) మార్కులకు సంబంధించిన మూల్యాంకన మార్కులను మండలంలోని చెన్నాయిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు వీరయ్య ఆధ్వర్యంలో పరిశీలన బృందం గురువారం తనిఖీ చేసింది. విద్యార్థుల రాత, ప్రాజెక్టు పనులు, సృజనాత్మకంశాలు, నిర్మాణాత్మక పరీక్షలు-2, సంగ్రహణాత్మక పరీక్ష-1లను ఉపాధ్యాయులు విద్యార్థులకు కేటాయించిన మార్కులను సవిధములు 20 మార్కులకు ఎంత కేటాయించారో అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు నాగయ్య, అంజయ్య, విజయ భాస్కర్‌రెడ్డి ఉపాధ్యాయులు సత్యనారాయణ, సైదయ్య, లక్ష్మి, దశరథ్‌నాయక్, శ్రీనివాస్, విజయలక్ష్మి, ఝాన్సీ, నరేందర్, లలిత పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : స్థానిక సాగర్ రోడ్డులోని మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం పదో తరగతికి సంబంధించిన ఇంటర్నల్ మార్కులను ఉపాధ్యాయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి మార్కుల కేటాయింపు ఎలా జరిగింది అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మల్లీశ్వరి, మానిటరింగ్ బృందం ఉపాధ్యాయలు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



దేవరకొండ : మాట్లాడుతున్న పర్యావరణ ఇంజనీర్ శక్రునాయక్

దేవరకొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని ఉద్యోగులందరూ స్వచ్ఛసర్వేక్షణ్ మెరుగైన ర్యాంక్ సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని దేవరకొండ మునిసిపాలిటీ పర్యావరణ ఇంజనీర్ శక్రునాయక్ పిలుపునిచ్చారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, మున్సిపల్ ఉద్యోగులు, శానిటేషన్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేరుచేయడం, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విధులు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుంకరి శంకర్‌గౌడ్, మేనేజర్ ఆరీఫొద్దిన్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శక్రునాయక్, జగమంతు, ఆంజనేయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కూతురిపై తండ్రి అసభ్య ప్రవర్తన

● *నిందితుడిపై పోక్సో కేసు నమోదు*

ఆదిబట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కన్న కూతురిపై అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రిపై పోక్సో కేసు నమోదైంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ కుటుంబం బతుక దెరువు కోసం 7 ఏళ్ల క్రితం బాలాపూర్ మండలం కుర్మల్‌గూడుకు వచ్చారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఒక అమ్మాయి, ఇద్దరు కుమారులు ఉన్నారు. అమ్మాయి హాస్టల్లో ఉంటూ 9వ తరగతి చదువు తోంది. 2024 అక్టోబర్‌లో దసరా సెలవులో ఇంటికి వచ్చింది. ఆ సమయంలో అమ్మాయికి టైఫాయిడ్ రావడంతో పాఠశాలకు వెళ్లడం ఆలస్యమైంది. బాలిక ఒంటరిగా ఇంట్లో ఉండగా తండ్రి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించి, నిద్ర పోతున్నపుడు శరీరం మొత్తాన్ని తాకి కాళ్లు పట్టుకొని కిందికి లాగాడు. బాలిక అరుస్తున్న సమయంలో నోటిని నొక్కి, ఎవరికైనా చెబితే నిన్ను, తల్లిని చంపేస్తా నని బెదిరించాడు. కూతురు ఇంటికి వచ్చిన ప్రతిసారీ ఇలానే ప్రవర్తించడంతో బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో తల్లి ప్రశ్నించగా జరిగినదంతా తల్లితో చెప్పింది. దీంతో తండ్రి బాధ భరించలేక సైదాబాద్‌కు వెళ్లిపోయారు. తండ్రి అక్కడికి వెళ్లి ఇలానే ప్రవర్తించగా కూతురు తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో తండ్రిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

36,318 మంది ఓటర్లు ..65 పోలింగ్ కేంద్రాలు

● నిడమనూరు మండలంలో 29 గ్రామ పంచాయతీలకు 13 ఎంపీటీసీ స్థానాలు ● పురుషుల కన్నా మహిళల ఓట్లే అధికం

నిడమనూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిడమనూరు మండలంలో ఓటరు తుది జాబితాను ప్రకటించారు. దీంతో పాటు పోలింగ్ కేంద్రాల ఏర్పాటును కూడా అధికారులు ఖరారు చేశారు. మండలంలో 29 గ్రామ పంచాయతీలకు 13 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇందుకు 65 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 36,318 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 17,635 మంది కాగా మహిళలు 18,682 మంది ఉన్నారు. పురుషుల కంటే 1,047 ఓట్లు మహిళలవి అధికంగా ఉన్నాయి. మండలంలోని అన్ని ఎంపీటీసీ స్థానాల్లోనూ. అన్ని కులాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అలాగే ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు కూడా ఉన్నారు. రాజన్నగూడెం, శాఖాపురం, పార్వతీపురం, మార్లగడ్డక్యాంపు నాలుగు గ్రామ పంచాయతీలను కలిపి 3,880 ఓట్లతో రాజన్నగూడెం ఎంపీటీసీ స్థానం పరిధి పెద్దగా ఉండగా, వేంపాడ్, వెంగన్నగూడెం, గుంటుకగూడెం మూడు గ్రామ పంచాయతీలను కలిపి 2,240 ఓట్లతో వేంపాడ్ ఎంపీటీసీ స్థానం చిన్నదిగా ఉంది.

అతి పెద్ద పంచాయతీగా నిడమనూరు

గ్రామ పంచాయతీల్లో 5,350 ఓట్లతో నిడమనూరు గ్రామ పంచాయతీ పరిధి పెద్దగా ఉండగా, 515 ఓట్లతో బంటువారిగూడెం గ్రామ పంచాయతీ చిన్నదిగా ఉంది.గతంలో మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మండలాల పునర్విభజనలో భాగంగా ధర్మాపురం,కన్నెకల్ ఎంపీటీసీ స్థానాలు మాడ్గులపల్లి మండలంలో, నేతాపురం స్థానం తిరుమలగిరి(సాగర్) మండలంలో కలిశాయి. దీంతో 12ఎంపీటీసీలు ఉండగా వేంపాడ్ ఎంపీటీసీ స్థానాన్ని కొత్తగా ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం 13 ఎంపీటీసీలు ఉన్నాయి. గతంలో మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా, నేతాపురం, మేగ్యాతండా పంచాయతీలు తిరుమలగిరి (సాగర్) మండలంలో, ధర్మాపురం, కన్నెకల్ పంచాయతీలు మాడ్గులపల్లి మండలంలో కలపడంతో 20 పంచాయతీలు మిగిలాయి. ఎర్రగూడెం, వెంకటాపురం, బంటువారిగూడెం, సోమారిగూడెం, గుంటుకగూడెం, పార్వతీపురం, ఇండ్లకోటయ్యగూడెం, మార్లగడ్డక్యాంపు, వడ్డెరగూడెం గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో మొత్తం 29 పంచాయతీలు ఉన్నాయి.



నిడమనూరు మండల పరిషత్ కార్యాలయం

మండలంలో కులాల వారీగా ఓటర్ల వివరాలు

కులం	పురుషులు	స్త్రీలు	మొత్తం
ఎస్టీ	330	368	698
ఎస్సీ	3,733	3,999	7,732
బీసీ	10,838	11,468	22,307
ఇతరులు	2,734	2,847	5,581

ఎంపీటీసీ స్థానం	పురుషులు	స్త్రీలు	మొత్తం
మారుపాక	1136	1160	2296
ఎర్రబెల్లి	1738	1774	3512
ఊట్కూరు	1143	1251	2394
ముప్పారం	1210	1230	2440
నిడమనూరు1	1296	1396	2692
నిడమనూరు2	1294	1364	2658
వేంపాడ్	1092	1148	2240
ముకుందాపురం	1639	1749	3388
వల్లభాపురం	1468	1530	2998
తుమ్మడం	1110	1197	2308
రాజన్నగూడెం	1844	2046	3880
నారమ్మగూడెం	1345	1502	2847
బంకాపురం	1320	1345	2665
ట్రాన్స్‌జెండర్	1		
మొత్తం	17,635	18,682	36,318

గత ఎన్నికల్లో ఏప పార్టీకి ..

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 13 ఎంపీటీసీలకుగాను బీఆర్ఎస్ 8, కాంగ్రెస్ పార్టీ 5 స్థానాలను గెలుచుకున్నాయి. దీంతో ఎంపీపీ పదవిని బీఆర్ఎస్ కైవసం చేసుకోగా జడ్పీటీసీ స్థానం మాత్రం కాంగ్రెస్ వశమైంది. అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు 18, కాంగ్రెస్ 10 పంచాయతీలు గెలుచుకోగా మండల కేంద్రంలో మాత్రం ఇండిపెండెంట్ అభ్యర్థి మేరెడ్డి పుష్పలత గెలిచారు. ఇక్కడ బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి మూడో స్థానంలో, కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి నాలుగో స్థానంలో నిలిచారు. ఓటర్ల జాబితా వివరాలు కింది విధంగా ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

100 శాతం పన్నుల వసూలుకు చర్యలు

రామదుర్గారెడ్డి, కమిషనర్, హాలియా



హాలియా మునిసిపాలిటీ పరిధిలో 100 శాతం పన్ను వసూలుకు కృషి చేస్తున్నట్లు హాలియా కమిషనర్ రామదుర్గారెడ్డి పేర్కొన్నారు. పన్నుల వసూలుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ పనులతో పౌరులకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఆంధ్రజ్యోతి కి ఇంటర్వ్యూలో తెలిపారు.
(ఆంధ్రజ్యోతి -హాలియా)

ఆంధ్రజ్యోతి : మునిసిపాలిటీలో పన్నుల వసూళ్ల పరిస్థితి ఏమిటి ?

కమిషనర్: హాలియాలో రూ. 2.4 కోట్ల పన్ను బకాయిలకు ఇప్పటి వరకు రూ.1.4 కోట్లు వసూలు చేశాం. మూడు బృందాల ద్వారా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నిత్యం ప్రజల నుంచి పన్నుల వసూలు చేస్తున్నాం. మార్చి 31 వరకు 100 శాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: ప్రస్తుతం మునిసిపాలిటీలో 23 లక్షల లీటర్ల నీరు అవసరం అవుతుంది. మునిసిపాలిటీలో 65 బోర్లు, 20 పవర్ బోర్లు ఉన్నాయి వీటి ద్వారా నీటి సరఫరా చేస్తాం. వేసవిలో బోర్లు ఎండిపోయే పరిస్థితి వస్తే ప్రైవేటు వ్యక్తుల ద్వారా అద్దెకు తీసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. మరో ట్యాంకర్ కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు పంపాం

ఆంధ్రజ్యోతి : చెత్తతో ప్రాసెసింగ్ చేస్తున్నారా ?

కమిషనర్: ఇళ్ల నుంచి ప్రతి రోజు వాహనాల ద్వారా 8 టన్నుల చెత్త డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నాం. అయితే వేరు చేయడంలో ప్రజలకు పొడి, తడి చెత్త వేరు చేయమని చైతన్యం చేస్తున్నాం. ప్రాసెస్ ఇంకా చేయాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి :మెప్మా ద్వారా రుణాలు అందించారా..

కమిషనర్: స్వయం సంఘంలోని ఉపాధి కోసం ఇందిరా మహిళా శక్తి కింద క్యాంటీన్‌కు రుణం మంజూరు చేశాం. 23 మంది మహిళలకు కూడా రుణాలు అందజేశాం.

ఆంధ్రజ్యోతి : ప్లాస్టిక్ కవర్లపై చర్యలు తీసుకుంటున్నారా..

కమిషనర్:నిషేధిత ప్లాస్టిక్ కవర్ల నివారణకు నిత్యం షాపుల్లో దాడులు నిర్వహిస్తున్నాం. షాపుల్లో దొరికితే జరిమానాలు సైతం విధించాం.



మంటలు అంటుకున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎఫ్ఆర్‌వో రాఘవేంద్ర

అటవీ ప్రాంతం పరిశీలన

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగిన ప్రాంతాన్ని అటవీ శాఖ రేంజర్ రాఘవేంద్ర, ఎఫ్ఎస్‌వో రమేష్, ఎఫ్‌బీవో పాపారావు గురువారం ఉదయం పరిశీలించారు. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు ఆరుగురు అటవీ శాఖ సిబ్బంది శ్రమించి ఎయిర్ బ్లో యర్లతో రెండు కిలోమీటర్ల మేర 120 ఎకరాల్లో వ్యాపించిన మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే అడవిలో ఎండిన గడ్డికి నిప్పు అంటించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

కిశోర బాలికలకు అవగాహన

దామరచర్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కిశోర బాలికలకు రుతుక్రమంపై గిరిజన గురుకుల పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో చంద్రకళ పాల్గొని మాట్లాడుతూ కిశోర బాలికలు రుతుక్రమం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుడ్ యూనివర్స్ ఎన్‌జీవో తబస్సుమ్, మండల విద్యాధికారి బాలాజీ నాయక్, పీహెచ్‌సీ వైద్యుడు నసీమా బేగం, సూపర్ వైజర్లు, ప్రిన్సిపాల్ స్వరూప, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జగ్గారావుకు ఎమ్మెల్సీ నివాళి

హాలియా, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అనుముల మండలం నాయుడుపాలెం క్యాంపుకు చెందిన బీఆర్ఎస్ అధ్యక్షుడు శివకోటి వీర్రాజు తండ్రి జగ్గారావు గురువారం మృతి చెందారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి గురువారం ఆయన మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఆయన వెంట మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజుయాదవ్, జలీల్, పున్నయ్య, చేగొండి కృష్ణ, మెగావత్ మంగ్యా, నాగెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, కందుల మధుసూదన్‌డ్డి, మంగ్యా నాయక్, గ్రామస్థులు, పాల్గొన్నారు.

నేటి నుంచి హజరత్ అబ్బాస్ దర్గా ఉర్సు

చింతపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీ.కే. మల్లేపల్లి గ్రామంలో హజరాత్ అబ్బాస్ దర్గాలో శుక్రవారం నుంచి ఈ నెల 23 వరకు నిర్వహించే 56వ ఉర్సుకు కమిటీ చైర్మన్, సభ్యులు ఏర్పాట్లు చేశారు. గ్రామానికి చెందిన దివంగత మహమ్మద్ లతీఫ్ సాహెబ్ కుమారులు దర్గా ముత్తవలీ చాంద్ పాషా, నేతృత్వంలో ఉర్సు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా 11 గంటల నుంచి దర్గా ముత్తవలీ మహమ్మద్ చాంద్ పాషా ఇంటి నుంచి గంధం(సందల్) ఒంటెపై గ్రామపురవీధుల గుండా ఊరిగేంపుతో దర్గా వద్దకు చేరుకుంటారు. ఉర్సుకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సినిమా, ఫొటో గ్రఫీ, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానా రెడ్డి, పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, హాజరుకానున్నారు. భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కమిటీ చైర్మన్ కేవీ.రమేష్‌రాజు, దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ఎజెండా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని టీజాక్ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. మిర్యాలగూడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం అన్ని మోడల్ స్కూల్స్, గురుకులాలు బీసీ వెల్ఫేర్, కేజీబీవీ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీ జేఏసీ (56) సంఘాలు బలపరిచిన తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. గతంలో ఎమ్మెల్సీలుగా పనిచేసిన వారు పోరాడకుండా ముఖం చాటేశారని అన్నారు. తనను గెలిపిస్తే దసరా నాటికి ఉమ్మడి సర్వీస్ రూల్స్, సెప్టెంబర్ నాటికి, సీపీఎస్ రద్దు చేయిస్తామని చెప్పారు.317 జీవోను సమర్థించి 33 మంది ఉపాధ్యాయుల మరణానికి కారణమయ్యారని అన్నారు. 25 వేలమంది స్థానికతను కోల్పోడానికి కారణమయ్యారని విమర్శించారు. 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే దసరా నాటికి ఉమ్మడి సర్వీస్ రూల్స్, సెప్టెంబర్ నాటికి, సిపిఎస్ రద్దు చేయిస్తామని చెప్పారు. జేఎల్, ఎంఈఓ, డిప్యూటీ డీఈవో, డిప్యూటీ ఎల్‌వో పోస్టుల పదోన్నతులు ఇప్పించగలనని అన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల కోసం 57/4, 57/5 మెమోలను అమలుపరిచేలా చేస్తానని తెలిపారు. మోడల్ స్కూల్స్ అన్నిరకాల గురుకులాల వారికి 010 పద్దు వేతనాలు, ఎస్ఎస్‌ఏ ఉద్యోగులకు పే స్కేల్, ఆరోగ్య కార్డుల మంజూరికి కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు రుషికేశ్, కార్తీక్, మధుసూదన్‌రెడ్డి, 317 నాగేశ్వర్‌రావు, శంకర్, రాఘవ రెడ్డి, గాదె లింగస్వామి, ఉమ్మడి శశిధర్‌రెడ్డి, మలిగిరెడ్డి సైదిరెడ్డి, అజీజ్ పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామి ఆలయంలో జలాధివాసం



కలశ పూజలో పాల్గొన్న ఆంజనేయస్వామి మాలధారులు

హాలియా, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీ స్వయంభూ భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామి వారి జలాధివాస నంది వెలుగు బాలాజీ గురుకుల్, త్రిశతాధిక ప్రతిష్ఠాచార్యుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వితీయ కాలయాగశాలర్చన, నిత్య హోమాలు, ప్రతిష్ఠా మూర్తులకు అష్టమూర్తికా స్వపనం, 108 కలశాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం వేద పారాయణం, జలాధివాసం, హోమం, నీరాజన మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి చేపట్టారు కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ మేడేపల్లి మోహన్‌రావు, గౌరవ అధ్యక్షుడు కాకునూరి నారాయణగౌడ్, పారిశ్రామికవేత్త చిట్టిపోలు యాదగిరి, పేలపూడి బాలకృష్ణ, కార్యదర్శి వర్కాల సుధాకర్‌రెడ్డి, కోశాధికారి రేపాల వెంకన్న, గౌని రాజారమేష్‌యాదవ్, కాకునూరి చిననారాయణ, రామాంజిరెడ్డి, చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, వడ్డే సతీష్‌రెడ్డి, నెర్మటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డి ఆశయాలను సాధించాలి



వర్ధంతి సభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాసరెడ్డి ఆశయాలను సాధించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన శ్రీనివాసరెడ్డి 6వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ పీడిత ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడినట్లు చెప్పారు. ఆయన త్యాగం మరువరానిదని అన్నారు. దోపిడీ, పీడనలేని సమాజాన్ని కలగన్న ఆయన ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, వరలక్ష్మి, వినోద్‌నాయక్, గాదె పద్మ, భవాండ్ల పాండు, తిరుపతి రాంమూర్తి, కోటిరెడ్డి, ఊర్మిల, అరుణ, గోవర్ధన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి)ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తిమేర కృషి చేస్తానని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో నన్ను గెలిపించారని నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై శాసన మండలిలో తన వంతుగా కృషి స్పందిస్తూ వచ్చానని అన్నారు. 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ సాధనలో నా వంతుగా కృషి చేసినట్లు తెలిపారు. తాను ఎమ్మెల్సీ ఉన్న సమయంలో రూ.9 కోట్లు మంజూరు కాగా ఈ నిధులను అభివృద్ధికి కేటాయించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో 4 నంబర్‌పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు భానుప్రకాశ్, వెంకటయ్య, పల్లా మధుసూదన్‌రెడ్డి, శ్రీను, సతీష్, మోహన్, శ్రీకాంత్, రవీందర్, పూర్య పాల్గొన్నారు.

పనిచేసే వారిని ఎన్నికల్లో గెలిపించాలి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పార్టీలను చూసి కాదు పనిచేసేవారని చూసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని పీఆర్టీయూ అధికార ప్రతినిధి ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడిరెడ్డి కోరారు. మిర్యాలగూడలో గురువారం వివిధ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులను కలిసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎమ్మెల్సీ పార్టీలు మారడం తప్ప సాధించింది ఏమీ లేదని అన్నారు. ఈ సారి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటువేసి తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. టీపీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు నెలల తరబడి బెనిఫిట్స్ కోసం వేచి చూడాల్సివస్తుందన్నారు. 25 సంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీపాల్‌రెడ్డినే గెలిపించాలని కోరారు. సమావేశంలో టీ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి జాన్‌రెడ్డి, సుంకర భిక్షంగౌడ్, నర్సింహరెడ్డి, బసిరెడ్డి రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, తిరుపతి నాయక్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గుడిపల్లి మండలం కోదండపురం గ్రామంలో పద్మావతీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం గురువారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. వేదపండితులు శ్రీనివాస చార్యులు బృందంచే హోమం పూజ, గణపతిపూజ నిర్వహించారు. ఈ కల్యాణంలో 1000 జంటలు పాల్గొన్నాయి. కల్యాణంలో ముఖ్య ఘట్టాలైన పుణ్యవచనం, రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ, పాద ప్రక్షాళనము, మధుపర్కం, కన్యాదానం, జీలకర్ర- బెల్లం, ముహూర్తం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు తంతులు నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్ని కల్యాణాన్ని తిలకించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు పట్టు వస్త్రం దాత కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి-శ్రావణి, తేరా లింగారెడ్డి- అనిత దంపతులు అందజేశారు. తదుపరి యాదగిరిగుట్ట లడ్డూ భక్తులకు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు వెంకట్ రమణాచారి, సైదిరెడ్డి, ఇందిరా, లక్ష్మయ్య, బిక్షమయ్య, వెంకటయ్య ఆలయ పూజారి శ్రీనివాసాచార్యులు, శ్రీకాంత్, శ్రీరమణచార్యులు పాల్గొన్నారు.

వ్యసనాల బారినపడొద్దు : ఎస్ఐ

పెద్దవూర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్ఐ వీరబాబు అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జాగృతి పోలీసు కళాబృందం కళాకారులచే విద్యార్థులకు ఆటపాట ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారిన పడవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, మైనర్లు వాహనాలను నడపవద్దని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఎస్కే హుస్సేన్, ఎల్.చంద్రశేఖర్, సత్యం, మురళి, జాగృతి కళాబృందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.